ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 తమిళనాడు TAMILNADU
సోమవారం 22 ఏప్రిల్ 2024

భానుడి భగభగలు


45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు - అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దంటూ వైద్యుల సూచన



అడయార్, ఏప్రిల్ 21: ఎల్‌నినో ప్రభావంతో పసిఫిక్ మహాసముద్ర తీరంలో ఏర్పడిన అధిక ఉష్ణతాపం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. దీనికి నిదర్శనంగా ఆదివారం ఏకంగా 45 డిగ్రీల (113 డిగ్రీల ఫారెన్‌హీట్) వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.. దీంతో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఉక్కపోతతో పాటు ఎండ తీవ్రతతో అల్లాడిపోతున్నారు. గత రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఎండ తీవ్రత అధికంగానే ఉంది. ఈ రెండు రోజుల్లో 41.1 డిగ్రీల సెల్సియస్ (106 డిగ్రీల ఫారెన్‌హీట్) మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే, గత మూడు రోజులుగా ప్రతి రోజూ సగటున 37.7 డిగ్రీల మేర పగటి పూట ఎండ తీవ్రత వుంది. ఇదే పరిస్థితి అనేక జిల్లాల్లో నెలకొంది. ముందు కూడా ఎండ ప్రభావం అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ యేడాది గరిష్ఠంగా పగటి పూట ఉష్ణోగ్రతలు నమోద కావొచ్చని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ యేడాది ఎండల తీవ్రత సాధారణం కంటే 2 నుంచి 5 డిగ్రీలు చొప్పున అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ కూడా ముందుగా తెలిపింది. ఈ కారణంగా అధిక ఉక్కపోతతోపాటు శరీరమంతా మంట పుట్టినట్టుగా ఉంటుందని వారు తెలిపారు. దీన్నే హీట్ స్ట్రోక్ అంటారని వైద్యులు చెబుతున్నారు. ఈ నెల 19వ తేదీ లోక్‌సభ ఎన్నికల పోలింగ్ రోజున కూడా ఓటు వేసేందుకు క్యూలో నిల్చొన్న ముగ్గురు వృద్ధులు కూడా ఎండవేడి భరించలేక అస్వస్థతకు లోనై ప్రాణాలు కోల్పోయిన విషయం తెల్సిందే. ఈ ఎండల తీవ్రతపై రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి డీన్ డాక్టర్ తేరణి రాజన్ మాట్లాడుతూ, ఎక్కువ సేపు ఎండలో నిలబడటం వల్ల శరీరంలోని నీరు చెమట రూపంలో ఆవిరై నిస్సత్తువ ఆవహిస్తుందన్నారు. దీంతో హీట్‌స్ట్రోక్ తగిలే అవకాశం అధికంగా ఉందన్నారు. ఈ స్ట్రోక్‌కు గురైన వారు మృత్యువాత పడేందుకు రెండు శాతం అవకాశాలున్నాయన్నారు. చూసేందుకు గుండెపోటుగానే ఉంటుందని కానీ ఎండ తీవ్రత కారణంగా హీట్‌స్ట్రోక్ తగులుతుందన్నారు. అందువల్ల రాష్ట్ర ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని లేనిపక్షంలో రావొద్దని సూచించారు. అలాగే, ఎండాకాలంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

దూరదర్శన్ లోగోకు కాషాయం

● బీజేపీపై స్టాలిన్ ఆగ్రహం



చెన్నై, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో దూరదర్శన్ లోగో ఎరుపు రంగునుంచి కాషాయ రంగుకు మార్చడం పట్ల డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లో తాను ఆరోపించినట్లే బీజేపీ మళ్ళీ అధికారంలోకి వస్తే అంతటా కాషాయ రంగే కనిపిస్తుందని చెప్పిన మాట ఇప్పుడు వాస్తవరూపం దాల్చిందన్నారు. ఈ మేరకు ఆదివారం మధ్యాహ్నం ఆయన తన ఎక్స్ పేజీలో ఓ ప్రకటన విడుదల చేశారు. మూడోసారి మళ్లీ అధికారంలోకి వస్తామనే ధీమాతోనే బీజేపీ పాలకులు దూరదర్శన్ లోగోను కాషాయ రంగులోకి మార్చారని, ఇది లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడక ముందే తీసుకున్న ముందస్తు చర్య అని, ఇక అధికారంలోకి వస్తే దేశమంతా కాషాయరంగే కనిపించడం తథ్యమని స్టాలిన్ అన్నారు. తమిళ ప్రజలు పంచమ వేదంగా భావించే తిరుక్కురళ్‌ను అందించిన తిరువళ్లువర్ విగ్రహాలకు బీజేపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ నేతలు, కార్యకర్తలు ఇష్టమొచ్చినట్లు కాషాయ రంగులు పులిమారని, కాషాయ దుస్తులు వేసి కళంకం సృష్టించారని ఆయన ఆరోపించారు. అంతే కాకుండా ద్రావిడ సిద్ధాంతాలను రూపొందించిన పెరియార్ వంటి నేతల విగ్రహాలను సైతం ఈ విధంగానే కళంకపరచిన ఘనత బీజేపీ, వీహెచ్‌పీ నాయకులకే దక్కుతుందన్నారు. రేడియో స్టేషన్లకు తమిళంలో 'వానొలి' అనే స్వచ్ఛమైన తమిళ పేరుండేదని, ఆ పేరును కాస్తా 'ఆకాశవాణి'గా మార్చి సంస్కృతానికి పట్టం గట్టారని, ఇక తమిళ దూరదర్శన్‌కు తమిళ భాషా పండితులంతా మెచ్చుకునే రీతిలో 'పొదిగై' అనే పేరుండేదని, దానిని కాస్తా డీడీ తమిళ్‌గా మార్చేశారని స్టాలిన్ పేర్కొన్నారు. కాగా పేర్లు మార్చటంతోనే సంతృప్తి చెందని బీజేపీ పాలకులు దూరదర్శన్ లోగో ఎరువుపు రంగును కాస్తా కాషాయ వర్ణంలోకి మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచార సమయంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే అంతటా కాషాయ రంగే కనిపిస్తుందని చెప్పానని, ప్రస్తుతం తన మాటలే నిజమవుతున్నాయని, ఈ పరిస్థితుల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాల్లోని ప్రజలంతా ఎన్డీయేని చిత్తుగా ఓడించాలని స్టాలిన్ పిలుపునిచ్చారు.

టిఫిన్‌బాక్స్ బాంబుతో దాడి

ఆటో డ్రైవర్ సహా ముగ్గురికి గాయాలు



ధ్వంసమైన కారు అద్దాలు- గాయపడిన నవీన్‌కుమార్

చెన్నై, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా మేలూరు సమీపం కీళ్‌వలైపు ప్రాంతం వద్ద విదేశాల్లో వ్యాపారం చేసే యువకుడిపై గుర్తు తెలియని దుండగులు టిఫిన్‌బాక్స్ బాంబుతో దాడి చేశారు. ఈ సంఘటనలో ఆ యువకుడు, ఆటోడ్రైవర్ సహా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా... కీళ్‌వలైపు ప్రాంతానికి చెందిన నవీన్‌కుమార్ (30) తరచూ విదేశాలకు వెళ్ళి వ్యాపార లావాదేవీలు జరుపుతున్నాడు. స్థానికంగాను కొన్ని వ్యాపారాలు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి కీళ్‌వలైపు బస్టాండు వద్ద నవీన్‌కుమార్ తన కారులో కూర్చుని స్నేహితుడితో మాట్లాడుతుండగా హఠాత్తుగా కారులో వచ్చిన నలుగురు వ్యక్తులు టిఫిన్‌బాక్స్ బాంబుతో దాడి చేసి పారిపోయారు. ఈ బాంబు పేలుడు సంఘటనలో నవీన్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. బస్టాండు సమీపంలోని ఆటోస్టాండు వద్ద నిలిచిన ఆటో డ్రైవర్ కన్నన్, ఆ ప్రాంతంలో జిరాక్స్ దుకాణం నడుపుతున్న సత్యమూర్తి (40) గాయపడ్డారు. బాంబు దాడిలో కారు అద్దాలు కూడా ధ్వంసమయ్యాయి. ఈ సమాచారం తెలుసుకుని కీళ్‌వలైపు పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో నవీన్‌కుమార్ ప్రత్యర్థులు బాంబుదాడికి పాల్పడినట్లు వెల్లడైంది. పరారైన దుండగుల ఆచూకీ కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

కేరళలో బర్డ్‌ఫ్లూ స్వైర విహారం

● సరిహద్దుల్లో నిఘా తీవ్రతరం



వాహనాలపై క్రిమినాశిని మందులు పిచికారి చేస్తున్న వెటర్నరీ సిబ్బంది

అడయార్, ఏప్రిల్ 21: కేరళ రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ స్వైర విహారం చేస్తోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కేరళ నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించే వాహనాలపై నిఘా వేశారు. ముఖ్యంగా కేరళ నుంచి కోళ్ళ దానా, కోళ్ళ ఉత్పత్తులు, కోడిమాంసం, కోడి గుడ్లు వంటివి సరఫరా కాకుండా అడ్డుకుంటున్నారు. కేరళ రాష్ట్రంలోని అలప్పుళా జిల్లాలోని కుట్టనాడులో బర్డ్‌ఫ్లూ కేసులు వెలుగు చూశాయి. ఈ కేసులు వచ్చిన కిలోమీటరు దూరంలోని కోళ్ళఫారాల్లో కోళ్ళతో పాటు కోళ్ళ ఉత్పత్తులను నిర్వీర్యం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కేరళ రాష్ట్ర సరిహద్దులకు ఆనుకునివున్న గ్రామాల్లో నిఘా పెట్టారు. ఇందులో భాగంగా రెండు రాష్ట్రాల మధ్య ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి కేరళ నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించే సరకు రవాణా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. కేరళ నుంచి రాష్ట్రానికి వచ్చే అన్ని రకాల కోళ్ళ ఉత్పత్తులను తిప్పి పంపుతున్నారు. రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ కేసులు ప్రబలకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే, కూరగాయలు, ఇతర కిరాణా సరకులతో వచ్చే వాహనాలను కూడా తనిఖీ చేస్తున్నారు. ఈ వాహనాల టైర్లకు క్లోరిన్ డై ఆక్సైడ్ అనే రసాయనాన్ని పిచికారి చేస్తున్నారు. ఇందుకోసం ఒక పశుసంవర్ధక శాఖ అధికారి, ఒక అసిస్టెంట్, క్రిమి సంహారిణి పిచికారి చేసే ఇద్దరు సిబ్బంది సరిహద్దుల్లోని చెక్ పోస్టుల వద్ద 24 గంటల పాటు నిత్యం విధుల్లో ఉంటున్నారు. కేరళ నుంచి కన్నియాకుమారికి వచ్చే వాహనాలను తనిఖీ చేసేందుకు వీలుగా కుమరి జిల్లా సరిహద్దుల్లో కూడా ప్రత్యేక చెక్ పోస్టులను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. పడందాలుమూడు ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో గట్టి నిఘా పెట్టారు. ఇక్కడ మూడు బృందాలుగా పశుసంవర్ధక శాఖ అధికారులు డ్యూటీ చేస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలో కోళ్ళపరిశ్రమకు పెట్టింది పేరైన నామక్కల్‌లోని కోళ్ళఫారాల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. అన్ని కోళ్ళఫారాల వద్ద క్రిమిసంహార మందులను పిచికారి చేస్తున్నారు. ఈ ఒక్క జిల్లాలోనే దాదాపు ఆరు కోట్ల కోడిగుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ కోళ్ళఫారాలకు దాణా తీసుకొచ్చే వాహనాల టైర్లకు క్రిమి సంహార మందు పిచికారి చేసిన తర్వాతే లోనికి అనుమతిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఒక్క బర్డ్‌ఫ్లూ కేసు కూడా నమోదు కాలేదని కోళ్ళఫారం యజమానులు అభిప్రాయపడుతున్నారు.



ఆదిదంపతులకు కంకణధారణ చేస్తున్న భట్టార్లు



మీనాక్షి అమ్మవారికి మాంగల్యధారణ



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

కమనీయం.. ఆదిదంపతుల కల్యాణం

● నేత్రపర్వంగా మీనాక్షి సుందరేశ్వరుల పరిణయోత్సవం

చెన్నై, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మదురై మీనాక్షి ఆలయంలో వార్షిక చిత్తిరై బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం మీనాక్షి, సుందరేశ్వరుల తిరుకల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ప్రధానఘట్టమైన అమ్మవారి పట్టాభిషేక మహోత్సవం శుక్రవారం జరిగింది. ఆ తర్వాత మదురై సామ్రాజ్ఞిగా అమ్మవారు పోరులో దేవతలను జయించి చివరగా సుందరేశ్వరుడితో పోరు సల్పే దిగ్విజయ మహోత్సవం శనివారం రాత్రి అట్టహాసంగా జరిగింది. ఈ నేపథ్యంలో మీనాక్షి అమ్మవారి తిరుకల్యాణోత్సవం ఆదివారం ఉదయం నిర్వహించారు. వేకువజాము నాలుగు గంటలకు సుందరేశ్వరుడు, మీనాక్షి అమ్మవారు రజత సింహాసనంలో ఆశీనులై నాలుగు చిత్తిరై వీధుల్లో ఊరేగారు. ఆలయంలోని పడమటి ఆడి వీధిలో ఉన్న కల్యాణవేదికను సుమారు పది టన్నుల పుష్పాలు, వెట్టి వేర్ల అలంకరించారు. ఉదయం 7.45 గంటల తిరుప్పరంకుండ్రం క్షేత్రం నుంచి వళ్ళి, దేవసేన సమేతుడై సుబ్రహ్మణ్యస్వామివారు, పవళక్కణివాయ్ పెరుమాళ్ తదితరులు కల్యాణవేదిక వద్దకు చేరారు. ఆ తర్వాత సర్వాలంకరణ శోభితులైన మీనాక్షి అమ్మవారు, సుందరేశ్వర స్వామివారు కల్యాణవేదికపై ఆశీనులు కాగానే శైవాగమ వేదపండితుల వేద మంత్రోచ్చారణ నడుమ కల్యాణ వేడుకలు ప్రారంభమయ్యాయి. మీనాక్షి అమ్మవారి కుడివైపు పవళవాయ్‌క్కని పెరుమాళ్, సుందరేశ్వర స్వామివారి ఎడమవైపు వళ్ళి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామివారు వేంచేశారు. మీనాక్షి అమ్మవారు ఆకుపచ్చ రంగు పట్టువస్త్రాలు, ముత్యాల కొప్పు, స్వర్ణకిరీటం, మాణిక్యం పొదిగిన ముక్కుపుడక, కాసుల మాల, పచ్చ పతకం వంటి మేలి రకం ఆభరణాలను ధరించి నవవధువుగా ఆశీనులయ్యారు. సుందరేశ్వర స్వామివారు కూడా పట్టువస్త్రాలు, పగడాలు పొదిగిన కిరీటం, వజ్రాలు పొదిగిన కంఠాభరణాలు ధరించి కొలువుదీరారు. ముందుగా విఘ్నేశ్వరపూజ, కల్యాణవేదికపై హోమగుండాన్ని వెలిగించి వేదపండితులు మంత్రోచ్చారణ చేశారు. సంకల్పం, గణపతి హోమం, పుణ్యాహవచనం, పంచగవ్యం, నవధాన్యాలు సమర్పించే పాలికా పూజలను నిర్వహించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ చేసి, కల్యాణోత్సవంలో సుందరేశ్వర స్వామివారికి పట్టు పరివట్టం, మీనాక్షి అమ్మవారికి పట్టుచీరతో పరివట్టం కట్టారు. వధూవరులకు ప్రత్యేక పూజల అనంతరం దీపారాధన చేశారు. అనంతరం పవళక్కనివాయ్ పెరుమాళ్ తన సోదరి మీనాక్షి దేవిని పరమేశ్వరుడికి కన్యాదానం చేశారు. ఉదయం 8.35 గంటల నుంచి వృషభలగ్నంలో శైవాచార్యులు వేదమంత్రాలు పటిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ మీనాక్షి, సుందరేశ్వరుల తిరుకల్యాణోత్సవం నిర్వహించారు. మీనాక్షి అమ్మవారుగా హలాలాస్యనాథన్‌భట్టర్, సుందరేశ్వరర్ స్వామిగా సెంథిల్‌నాథన్ భట్టర్ వేషధారణ చేసుకుని వారిరువురూ దండలు మార్చుకున్నారు. ఆ తర్వాత సుందరేశ్వరుడి వేషధారి సెంథిల్‌నాథన్ భట్టర్ వజ్రం పొదిగిన తిరుమాంగళ్యాన్ని మీనాక్షి అమ్మవారికి ధరింపజేశారు. అమ్మవారి మాంగల్యధారణ సమయంలోనే వేడుకలో పాల్గొన్న మహిళలు, ఆలయం వెలుపల ఉన్న మహిళలు కొత్త పసుపుతాళ్లను కట్టుకున్నారు. ఈ తిరుకల్యాణోత్సవాన్ని తిలకించేందుకు 12 వేల మంది భక్తులను అనుమతించారు. మిగతా భక్తులంతా దర్శించేందుకు చిత్తిరై వీధి, మాసివీధుల్లో ఏర్పాటు చేసిన 20కిపైగా ఎల్‌ఈడీ స్క్రీన్లపై ఈ వేడుకలను ప్రత్యక్ష ప్రసారం చేశారు. కల్యాణోత్సవం ముగిసిన తర్వాత నూతన వధూవరులుగా స్వామి, అమ్మవారు కల్యాణమండపంలో వేంచేసి భక్తులకు దర్శనమిచ్చారు. మీనాక్షి సుందరేశ్వరుల కల్యాణోత్సవాన్ని తిలకించే యువతులకు వివాహాలు జరుగుతాయని భక్తులు విశ్వసిస్తుండటంతో ఈ వేడుకలకు పెళ్ళీడు యువతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులందరూ సులువుగా దర్శనం చేసుకునేలా స్వామి, అమ్మవారు పాత కల్యాణ మండపంలోనే ఆదివారం సాయంత్రం వరకూ కొలువు దీరారు. మీనాక్షి అమ్మవారి కల్యాణోత్సవం సందర్భంగా మదురై నగరమంతటా స్థానికులు, స్థానికేతరుల రాకపోకలతో సందడిగా మారింది. తిరుకల్యాణోత్సవంలో పాల్గొన్న 12 వేల మంది భక్తులకు సేతుపతి పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక విందు కూడా ఏర్పాటు చేశారు. ఆ విందులో పాల్గొన్న భక్తులంతా స్వామి, అమ్మవారికి వేర్వేరుగా నగదు చదివింపులు చేసి, కానుకలను సమర్పించారు.



కొత్త పసుపుతాళ్ళను కట్టుకుంటున్న మహిళలు

34 నియోజకవర్గాల్లో తగ్గిన ఓట్ల శాతం



చెన్నై, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల శాతం బాగా తగ్గింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో నమోదైన ఫలితాలను పరిశీలిస్తే 34 నియోజకవర్గాల్లో గతం కంటే ఓట్ల శాతం తగ్గినట్లు స్పష్టమవుతోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో నగర పరిధిలోని నార్త్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గంలో 64.13 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈసారి పోలింగ్ శాతం 60.13కు తగ్గింది. సౌత్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గంలో 54.27 శాతం ఓట్లు, సెంట్రల్ చెన్నైలో 53.91 శాతం ఓట్లు పోలయ్యాయి. సౌత్ చెన్నైలో గత ఎన్నికల కంటే 3 శాతం, సెంట్రల్ చెన్నైలో 5 శాతం ఓట్లు తగ్గాయి. ఇదే విధంగా తిరువళ్లూరులో గత ఎన్నికల్లో 72.13 శాతం ఓట్లు నమోదు కాగా ఈసారి 68.31 శాతం మేరే పోలయ్యాయి. కాంచీపురంలో 71.55 శాతం, శ్రీపెరుంబుదూరులో 60.21 శాతం ఓట్లు పోలయ్యాయి. మునుపటి ఎన్నికలకంటే కాంచీపురంలో 4 శాతం, శ్రీపెరుంబుదూరులో ఒక శాతం ఓట్లు తగ్గాయి. అరక్కోణంలో గతం కంటే నాలుగు శాతం తగ్గి 74.08 ఓట్లు పోలయ్యాయి. కృష్ణగిరిలోను నాలుగు శాతం తగ్గి 71.31 శాతం ఓట్లు, ధర్మపురిలో ఒక శాతం తగ్గి 81.48 శాతం ఓట్లు పోలయ్యాయి. తిరువణ్ణామలైలో 5 శాతం తగ్గి 73.88 శాతం పోలింగ్ నమోదైంది. ఆరణిలో మూడు శాతం ఓట్లు తగ్గి 71.65 శాతం పోలింగ్ నమోదైంది. నామక్కల్, ఈరోడ్, తిరుప్పూరు నియోజకవర్గాల్లో గత ఎన్నికల కంటే మూడు శాతం ఓట్లు తగ్గి వరుసగా 78.16, 70.45, 70.58 శాతం చొప్పున పోలింగ్ నమోదైంది. నీలగిరిలో 73.99 శాతం నుంచి 70.93 శాతానికి, పొల్లాచ్చిలో 71.69 నుంచి 70.70 శాతానికి, దిండుగల్‌లో 75.24 నుంచి 70.99 శాతానికి, కరూరులో 71.23 నుంచి 70.99 శాతానికి పోలింగ్ తగ్గింది. తూత్తుకుడిలో 69.43 నుండి 66.88 శాతానికి, కన్నియాకుమారిలో 69.83 నుంచి 65.46 శాతానికి పోలింగ్ తగ్గింది. ఇదే విధంగా తక్కిన లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ పోలింగ్ శాతం ఒకటి నుంచి ఐదు శాతం వరకూ తగ్గిందని ఎన్నికల సంఘం ప్రకటించిన వివరాలను బట్టి తెలుస్తోంది. ఎండలు అధికంగా ఉండటం వల్లే పోలింగ్ శాతం తగ్గిందని అధికారులు, పాలకపక్షం నేతలు చెబుతున్నారు. అయితే ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే, బీజేపీ నేతలు ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరిగినందువలనే పోలింగ్ శాతం తగ్గిందని ఆరోపిస్తున్నారు. పలు చోట్ల పోలింగ్ కేంద్రాల్లో వందల సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించడంతో ఓటు వేయడానికి తిరుగుముఖం పట్టారని బీజేపీ నేతలు ఆరోపించారు.

ఈసీ అజాగ్రత్తల వల్లే...

రాష్ట్ర ఎన్నికల సంఘం అప్రమత్తంగా వ్యవహరించకపోవడం వల్లే ఓటర్ల జాబితాల్లో వందల సంఖ్యలో పేర్లు అదృశ్యమయ్యాయని డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ నగరంలో పోలింగ్ శాతం తగ్గటానికి వరుసగా మూడు రోజులు సెలవుదినాలు కావటంతో చాలామంది ఓటు వేయకుండా స్వస్థలాలకు వెళ్ళటమే ప్రధాన కారణమన్నారు. ఎండల వల్ల కూడా పోలింగ్ శాతం తగ్గటం వాస్తవమే అయినా, ప్రతి నియోజకవర్గంలోనూ ఓటరు గుర్తింపు కార్డులు కలిగిన వందలాదిమంది ఓటర్ల పేర్లు లేకపోవడం వల్ల ఓటేయలేకపోయారన్నారు. ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను తయారు చేయడంలో అజాగ్రత్తగా వ్యవహరించడం వల్లే పోలింగ్ శాతం గత ఎన్నికల కంటే ఐదారు శాతం వరకు తగ్గిందని ఆర్ఎస్ భారతి తెలిపారు.

వైభవంగా తిరువళ్లూరు పెరుమాళ్ రథోత్సవం


భూదేవి, శ్రీదేవీ సమేత వైద్య వీరరాఘవ పెరుమాళ్ స్వామి


రథ మండప ప్రాంతం నుంచి బయలుదేరిన రథం

చెన్నై, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు వైద్య వీరరాఘవ పెరుమాళ్ ఆలయ చిత్తిరై బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆలయంలో ప్రతి యేటా తై, చిత్తిరై మాసాల్లో బ్రహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఆ మేరకు ఈ యేడాది చిత్తిరై బ్రహ్మోత్సవాలు ఈ నెల 15న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో ప్రతి రోజూ స్వామివారు ఆలయ ప్రధాన వీధులలో వివిధ వాహనాలపై ఊరేగి భక్తులకు దర్శనమిస్తారు. ఈ బ్రహోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఆదివారం ఉదయం ప్రారంభమైంది. భూదేవి, శ్రీదేవి సమేతులైన వీరరాఘవపెరుమాళ్ సర్వాలంకరణ శోభితులైన వేకువజాము 5.30 గంటలకు రథంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక పీఠంపై ఆశీనులయ్యారు. ఉదయం 7.30 గంటలకు వేలాదిమంది భక్తులు మోకుతాళ్లను పట్టుకుని రథాన్ని లాగుతూ వెళ్ళారు. ఆ రథం, పనగల్ వీధి, కొలను వీధి, బజారు వీధి, ఉత్తరరాజవీధి, మోతీలాల్ వీధి తదితర ప్రధాన వీధులమీదుగా వెళ్ళి రథ మండప ప్రాంతానికి తిరిగొచ్చింది. ఈ వేడుకల్లో చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు, సత్యవేడు, నాగలాపురం, పుత్తూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఇక ఈ నెల 23 ఉదయం తీర్థవారీ, 24 రాత్రి స్వామివారికి అద్దాల పల్లకీ సేవల జరుగుతాయి.

రేపటి నుంచి పార్థసారథి ఆలయ బ్రహ్మోత్సవాలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 21: స్థానిక ట్రిప్లికేన్‌లో ఉన్న పార్థసారధి ఆలయ చైత్ర మాస బ్రహ్మోత్సవాలు ఈ నెల 23వ తేది ఉదయం 8 గంటలకు ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి సోమవారం సాయంత్రం 6 గంటలకు అంకురార్పణం, సేనైముదన్మయార్ కార్యక్రమాలు జరుగనున్నాయి. 24వ తేది ఉదయం 6.15 గంటలకు శేష వాహనంలో పరమపదనాథన్ దర్శనమిస్తారు. ఆ రోజు రాత్రి 7.45 గంటలకు సింహ వాహనంలో ఊరేగింపు జరుగనుంది. ఉత్సవం మూడో రోజు ఉదయం 5.15 గంటలకు గోపుర దర్శనంతో గరుడ సేవ, ఆరోజు మధ్యాహ్నం 12 గంటలకు ఏకాంతసేవ, రాత్రి 7.45 గంటలకు హంస వాహనంలో ఊరేగింపు జరుగనుంది. 27న నాచియర్ పల్లకీ సేవ, ఆరోజు రాత్రి 8.30 గంటలకు హనుమద్ వాహనంపై స్వామి దర్శనం, 29వ తేది రథోత్సవం జరుగనుంది. మే 3 నుంచి 10వ తేది వరకు విడయాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి.

సమాచార దర్శిని

రెండు రోజుల పాటు మోస్తరు వర్షాలు

పెరంబూర్, ఏప్రిల్ 21: సముద్రతీర ప్రాంతంలో ఏర్పడిన ఉపతల ఆవర్తన ద్రోణి ప్రభావంతో సోమ, మంగళవారాల్లో పశ్చిమ కనుమల జిల్లాలు, సరిహద్దు జిల్లాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం తెలియజేసింది. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 24 నుంచి 26వ తేది వరకు పొడి వాతావరణం నెలకొని ఉంటుంది. రాజధాని నగరం చెన్నైలో ఆకాశం మేఘావృతంగా ఉంటూ గరిష్ఠంగా 37 డిగ్రీలు, కనిష్ఠంగా 27 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

29 నుంచి నీలగిరి మేకల గణన

ఐసిఎఫ్,ఏప్రిల్ 21:రాష్ట్రంలో నీలగిరి మేకల గణన ఈ నెల 29 నుంచి మే 1వ తేదివరకు జరుగనుంది. నీలగిరి, ముక్కుర్తి జాతీయ పార్కు నుంచి కన్నియాకుమారి వరకు ఉన్న శరణాలయం, పశ్చిమకనుమల్లోని 140 ప్రాంతాల్లో నీలగిరి మేకలు నివసిస్తున్నాయి.గత ఏడాది అక్టోబరు 23వ తేది ఈ గణన జరగాల్సి ఉండగా వివిధ కారణాలతో వాయిదాపడింది. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో తొలిసారిగా ఈ నెల 29న గణన ప్రారంభం కానుంది.

'గీతా మహత్యం'పై ఆన్‌లైన్ తరగతులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 21: ఇస్కాన్ ఆధ్వర్యంలో 'గీతా మహత్యం'పై ఏడు రోజుల పాటు ఉచిత ఆన్‌లైన్ తరగతులు జరుగనున్నాయి. వేసవి సెలవులను పురస్కరించుకొని సోమవారం నుంచి 28వ తేది వరకు ప్రతిరోజు రాత్రి 8 నుంచి 9 గంటల వరకు ఈ తరగతులు నిర్వహించనున్నారు. తమిళం, ఆంగ్లంలో నిర్వహిస్తున్న తరగతుల్లో శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తారు. ఆసక్తి ఉన్న వారు 735851 1132 వాట్సాప్ నెంబరుకు సంప్రదించి పేర్లు నమోదుచేసుకోవాలని ఇస్కాన్ నిర్వాహకులు తెలిపారు.

క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

ఐసిఎఫ్, ఏప్రిల్ 21: నగరంలో క్రికెట్‌పై ఆసక్తి ఉన్న 12 ఏళ్ల పిల్లలు పేర్లు నమోదుచేసుకోవాలని రాష్ట్ర క్రికెట్ సంఘం(టీఎన్‌సీఏ)ఆహ్వానిస్తోంది.ఈసంఘం ఆధ్వర్యంలో బాలల సిటీయూ-12ఎంపిక పోటీలు జరుగనున్నాయి.నగరంలో నివసించే 12ఏళ్లలోపున్న వారు మే 3 నుంచి 6వ తేది వరకు చేపాక్కం ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగే ఎంపికలో పాల్గొనవచ్చు. ఆసక్తి ఉన్న వారు ఈనెల26వ తేదిలోపు www.tnca.in అనే వెబ్‌సైట్‌లో పేరు నమోదుచేసుకోవాలని టీఎన్‌సీఏ తెలిపింది.

నేటినుంచి 25 శాతం కోటా అడ్మిషన్లు

ఐసిఎఫ్, ఏప్రిల్ 21:ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్ కోటా సీట్లకు సోమవారం నుంచి అడ్మిషన్లు జరుగనున్నాయి. ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయిస్తున్నారు. వీరి విద్యా ఫీజు ను ప్రభుత్వం ఆ పాఠశాలలకు చెల్లిస్తుంది. ఈ క్రమంలో, 2024-25 విద్యా సంవత్సరం అడ్మిషన్లకు సోమవారం నుంచి rte.tnschools.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు స్వీకరణ జరుగనుంది. ఆసక్తి ఉన్న వారు మే 20వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

నేడు బాస్కెట్‌బాల్ పోటీలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 21: రైజింగ్ స్టార్ బాస్కెట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో 18వ వార్షిక రాష్ట్రస్థాయి పోటీలు టి.నగర్ వెంకటనారాయణ వీదిలో ఉన్న కార్పొరేషన్ మైదానం, పెరియమేడు నెహ్రూ స్టేడియంలో జరుగనున్నాయి. ఐసిఎఫ్, ఎస్ఆర్ఎం వర్సిటీ, ఇండియన్ బ్యాంక్ సహా 75 పురుషుల జట్లు, 26 మహిళా జట్లు పాల్గొంటున్నాయి. పోటీల్లో మొదటి మూడు స్థానాలు పొందే జట్లకు రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు అందజేయనున్నారు.

వేసవికి 19 ప్రత్యేక రైళ్లు

ఐసిఎఫ్, ఏప్రిల్ 21: వేసవి సెలవులు పురస్కరించుకొని 19 ప్రత్యేక రైళ్లను 239 సర్వీసులుగా నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. ప్రయాణికుల రద్దీ నియంత్రించేలా దేశవ్యాప్తంగా 9,111 రైళ్ల సేవలు నిర్వహిస్తున్నారు. దక్షిణ రైల్వే ఆధ్వర్యంలో తమిళనాడు, కేరళ, కర్ణాటక నుంచి రాజస్థాన్, బీహార్ రాష్ట్రాలకు ఈ రైళ్ల నడుపనున్నారు.

రేపటి వరకు సీజన్ టిక్కెట్ల పంపిణీ

ఐసిఎఫ్, ఏప్రిల్ 21: నగరంలో ఈ నెల 23వ తేది వరకు బస్ సీజన్ టిక్కెట్లు పంపిణీ చేయనున్నట్లు ఎంటీసీ అధికారులు తెలిపారు. ఎంటీసీ బస్సుల్లో ఈ నెల 16 నుంచి మే 15వ తేది వరకు ప్రయాణించేలా రూ.1,000, రాయితీ పాస్‌లు 22వ తేది వరకు విక్రయించనున్నారు. ఈ నెల 11,14,19 తేదీల్లో సెలవులు రావడంతో ప్రయాణికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సీజన్ల టిక్కెట్ల విక్రయాలు ఈ నెల 23 వరకు విక్రయించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఉత్తమ విద్యాసంస్థల జాబితాలో రాజధాని కళాశాలకు మూడో స్థానం

ఐసిఎఫ్, ఏప్రిల్ 21: దేశంలో ఉత్తమ విద్యాసంస్థల్లో నగరంలో ఉన్న రాజధాని కళాశాల మూడో స్థానం పొందింది. ప్రతి ఏటా ఉత్తమ విద్యాసంస్థలను ఎంపిక చేసి ఆ జాబితాను కేంద్ర విద్యాశాఖ, ప్రైవేటు సంస్థలు సంయుక్తంగా విడుదల చేస్తున్నాయి. ఈ క్రమంలో, 2024-25 జాబితాను విడుదల చేయగా, మెరీనా తీరంలో ఉన్న రాజధాని కళాశాల మూడవ స్థానం పొందింది. మదురై మీనాక్షి ప్రభుత్వ మహిళా ఆర్ట్స్ కళాశాల, పుదుకోట కలైంజర్ కరుణానిధి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, సేలం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, వేలూరు ముత్తురంగ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలు కూడా ఈ జాబితాలో చోటుచేసుకున్నాయి.

పళని ఆలయంలో జపాన్ భక్తులు

ప్యారీస్, ఏప్రిల్ 21: దిండుగల్ జిల్లాలో ప్రసిద్ధిచెందిన పళని సుబ్రమణ్యస్వామి ఆలయాన్ని జపాన్ దేశానికి చెందిన భక్తులు సందర్శించి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. పళని క్షేత్రంలో కొండపై ఉన్న ఆలయానికి ప్రతిరోజు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి సుబ్రమణ్యస్వామిని దర్శనం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, జపాన్ దేశం టోక్యోకు చెందిన 50 మందికి పైగా భక్తులు శివాచార్యుడు బాలకుంభ స్వామి నేతృత్వంలో శనివారం పళని ఆలయాన్ని దర్శించారు. వారు బోగర్ సన్నిధిలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

వళ్ళలార్ అంతర్జాతీయ కేంద్రం నిర్మాణ పనులు మళ్లీ ప్రారంభం

చెన్నై, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా వడలూరులో ఆధ్యాత్మికవేత్త వళ్ళలార్ నెలకొల్పిన సత్యజ్ఞానసభ ప్రాంతంలో వళ్ళలార్ అంతర్జాతీయ కేంద్రం నిర్మాణ పనులు ఆదివారం ఉదయం మళ్లీ ప్రారంభమయ్యాయి. రూ.100 కోట్లతో నిర్మించనున్న ఆ కేంద్రానికి ఇటీవలే రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఆ ప్రాంతంలో పునాదులు తవ్వుతుండగా స్థానికులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు నిరసన ప్రకటించారు. పార్వతీపురం ప్రజలు తవ్విన పునాదుల్లో నిలిచి ధర్నా జరిపారు. దీంతో ఆ కేంద్రం నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఆదివారం ఉదయం పోలీసుల భద్రతా ఏర్పాట్ల నడుమ వళ్ళలార్ అంతర్జాతీయ కేంద్రం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

ఉద్యోగాల కోసం 54.25 లక్షల మంది నిరీక్షణ

పెరంబూర్, ఏప్రిల్ 21: రాష్ట్రంలోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయాల్లో ఉద్యోగాల కోసం పేర్లు నమోదుచేసుకున్న వారి సంఖ్య 54.25 లక్షలుందని రాష్ట్రప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. గత మార్చి నెల గణాంకాల ప్రకారం ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయాల్లో నమోదుచేసుకున్న వారి సంఖ్య 54,52,114గా నమోదైంది.. వారిలో పురుషులు 25,00,134 మంది, మహిళలు 29,24,695 మంది కాగా, హిజ్రాలు 285 మంది ఉన్నారు. అలాగే, 18 ఏళ్లలోపున్న విద్యార్థులు 10.83 లక్షలు, 19 నుంచి 30 ఏళ్లలోపున్న విద్యార్థులు 23.92 లక్షలు, 31 నుంచి 45 ఏళ్లలోపున్న వారు 17.03 లక్షల మంది ఉన్నారు. అదే సమయంలో ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇస్తుండడంతో పేరు నమోదుచేసుకొనే వారి సంఖ్య పెరిగింది. 1,49,647 మంది దివ్యాంగులు పేర్లు నమోదుచేసుకోగా, వారిలో పురుషులు 99,680 మంది, మహిళలు 49,967 మంది ఉన్నట్లు ప్రభుత్వం తెలియజేసింది.

పోలింగ్ కేంద్రాల్లో అస్వస్థతకు గురైన 428 మందికి చికిత్సలు

పెరంబూర్, ఏప్రిల్ 21: రాష్ట్రంలో గత శుక్రవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటేసేందుకు క్యూలైన్లలో వేచి అస్వస్థతకు గురైన 428 మందికి చికిత్స అందించినట్లు ఆరోగ్యశాఖ తెలిపింది. లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని నగర పరిధిలో 3,726 పోలింగ్ కేంద్రాలు సహా రాష్ట్రవ్యాప్తంగా 68,000 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఓటేసేందుకు వచ్చి అస్వస్థతకు గురయ్యే వారికి సత్వర చికిత్స అందించేలా 1,353 పోలింగ్ కేంద్రాల వద్ద అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచారు. ఎండ తీవ్రత, ఇతర అనారోగ్య సమస్యల కారణంగా అస్వస్థతకు గురైన చెన్నైలో అత్యధికంగా 50 మందికి చికిత్సలందించారు. అలాగే, కోయంబత్తూర్‌లో 33 మంది, తిరువళ్లూర్, చెంగల్పట్టులో తలా 27 మంది, ఈరోడ్, సేలంలో వరుసగా 20,21 మందికి అత్యవసర చికిత్సలు అందజేసినట్లు ఆరోగ్యశాఖ తెలిపింది.

30.49 లక్షల ఫిర్యాదుల పరిష్కారం

ఐసిఎఫ్, ఏప్రిల్ 21: కార్మిక భవిష్య నిధి సంస్థ చెన్నై, పుదుచ్చేరి మండల కార్యాలయంలో 39.40 లక్షల సమస్యలు పరిష్కరించినట్లు అధికారులు తెలిపారు. ఈ సంస్థ రాష్ట్రంలో 10, పుదుచ్చేరిలో 2 కార్యాలయాలున్నాయి. వీటి ఆధ్వర్యంలో 79,433 సంస్థల్లో పనిచేసే 2.05 కోట్ల మంది చందాదారులున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం ఈ కార్యాలయాలు 30.49 లక్షల వినతిపత్రాలు, ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు పరిష్కరించాయి. గత ఏడాది కన్నా 2.74 లక్షల సమస్యలు పరిష్కరించినట్లు అధికారులు తెలిపారు.

చిన్న అడవుల ఏర్పాటుకు ఉత్తర్వులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 21: రాష్ట్రంలో చిన్న అడవులు ఏర్పాటుచేయాలని కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులకు ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర భూభాగంలో 23.8 శాతం మాత్రమే అడవులున్నాయి. 2030-31 ఆర్థిక సంవత్సరంలోగా 33 శాతం అడవులు పెంచేందుకు పర్యావరణ, అటవీ శాఖ చర్యలు చేపట్టింది. కాలుష్య నియంత్రణ బోర్డు ద్వారా కర్మాగారాల సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా 1,000 ప్రాంతాల్లో చిన్న అడవులు ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ స్థలాలు, జలవనరుల సమీపం, కళాశాల ప్రాంగణాల్లో వేప, మర్రి, రావి, జామ వంటి 21 రకాల మొక్కలు నాటి పర్యవేక్షించాలని అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కున్నూరు బస్‌స్టేషన్‌లో అడవి దున్న సంచారం


కున్నూరు సెంట్రల్ బస్‌స్టేషన్ సమీపంలో తిరుగుతున్న అడవి దున్న

చెన్నై, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కున్నూరు సెంట్రల్ బస్‌స్టేషన్ ప్రాంతంలో ఆదివారం ఉదయం ఓ అడవి దున్న సంచరించడంతో ప్రయాణికులు భీతిల్లారు. నీలగిరి అటవీ ప్రాంతంలో వేసవి కారణంగా నీటి వనరులు ఎండిపోవడంతో ఏనుగులు, అడవి దున్నలు జనావాసాల్లోకి రావటం ఆనవాయితీగా మారింది. ఈ నేపథ్యంలో కున్నూరు బస్‌స్టేషన్ ప్రాంతానికి అడవి దున్న రావటంతో వాహన చోదకులు, ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. అదృష్టవశాత్తూ ఆ అడవి దున్న ఎవరికీ ఎలాంటి హాని తలపెట్టకుండా సమీపంలోనే ఉన్న చిట్టడవిలోకి వెళ్లిపోయింది.

తమిళనాడు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా హసీనా సయ్యద్



ప్యారీస్, ఏప్రిల్ 21: తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) మహిళా విభాగం అధ్యక్షురాలిగా హసీనా సయ్యద్ నియమితులయ్యారు. ఈ పదవిలో ఇన్నాళ్లు కొనసాగిన న్యాయవాది సుధ, లోక్‌సభ ఎన్నికల్లో మైలాడుదురైలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేశారు. ఈ నేపథ్యంలో, హసీనా సయ్యద్‌ను రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమిస్తూ ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీచేశారు. ఆమె మహిళా కాంగ్రెస్ జాతీయ కార్యదర్శిగా వ్యవహరిస్తూ, పార్టీ తరపున టీవీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

అత్తను చంపిన అల్లుడి అరెస్ట్

ప్యారీస్, ఏప్రిల్ 21: స్థానిక మాధవరంలో మద్యం మత్తులో అత్తను దారుణంగా హతమార్చిన అల్లుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మాధవరం కన్నన్ నగర్‌కు చెందిన పుష్పరాజ్ భార్య ఝాన్సీ (40) ప్రభుత్వ రాజీవ్ గాంధీ జనరల్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడున్నాడు. ఝాన్సీ తల్లి వసంతి (65) భర్తను కోల్పోయి కుమార్తెతోనే ఉంటున్నారు. మద్యానికి బానిసైన పుష్పరాజ్ ఏపనికి వెళ్లకుండా కుటుంబం గురించి ఆలోచించకపోవడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో, శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో పీకల దాకా మద్యం సేవించి ఇంటికెళ్లిన పుష్పరాజ్, తన భార్యతో గొడవపడుతుండడం చూసిన వసంతి అతడిని మందలించింది. దీంతో పుష్పరాజ్ కోపంగా కర్రతో కొట్టడంతో తీవ్రంగా గాయపడిన వసంతిని అంబులెన్స్‌లో రాజీవ్ గాంధీ జనరల్ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందింది. ఈ ఘటనపై మాధవరం పోలీసులు కేసు నమోదుచేసి ఆదివారం ఉదయం పుష్పరాజ్‌ను అరెస్ట్ చేశారు.

డీఎంకే సీనియర్ నేత ఆర్కాడు వీరాస్వామికి స్టాలిన్ శుభాకాంక్షలు


ఆర్కాడు వీరాస్వామికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

ప్యారీస్, ఏప్రిల్ 21: డీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి ఆర్కాడు వీరాస్వామి జన్మదిన వేడుకలను ఆదివారం ఆ పార్టీ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ ఆర్కాడు వీరాస్వామి నివాసానికి వెళ్లి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సీఎంతో పాటు రాష్ట్ర మంత్రులు కేఎన్ నెహ్రూ, ఆర్.గాంధీ, టీఆర్బీ రాజా, ఎంపీలు ఎ.రాజా, కళానిధి వీరాస్వామి, ఎమ్మెల్యే ఎంకే మోహన్ తదితరులు ఆర్కాడు వీరాస్వామికి శుభాకాంక్షలు తెలియజేశారు.

రూ.15 లక్షల విలువైన చేపల వలలు దగ్ధం


దగ్ధమైన వలలను పరిశీలిస్తున్న జాలర్లు

పెరంబూర్, ఏప్రిల్ 21: స్థానిక పళవేర్కాడులో తీరంలో ఉంచిన రూ.15 లక్షల విలువైన వలలు దగ్ధమయ్యాయి. ప్రస్తుతం చేపల వేట నిషేధ కాలం కావడంతో జాలర్లు తమ వలలు, పరికరాలను తీరం సమీపంలో ఉంచారు. ఈ క్రమంలో, శనివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో హఠాత్తుగా వలలుంచిన ప్రాంతంలో మంటలు చెలరేగాయి. మంటలు గమనించిన జాలర్లు నీరు, ఇసుక పోసి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. ఆలోపే రూ.15 లక్షల విలువైన రొయ్యలు పట్టే వలలు, పరికరాలు దగ్ధమయ్యాయని జాలర్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు, ఈ ప్రమాదానికి గత కారణాలపై విచారణ చేపట్టారు.

తమిళనాడు-కేరళ సరిహద్దుల్లో తనిఖీలు ముమ్మరం

పెరంబూర్, ఏప్రిల్ 21: తమిళనాడు-కేరళ రాష్ట్రాల సరిహద్దుల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. రాష్ట్రంలో ఉన్న 39 లోక్‌సభ నియోజకవర్గాలు సహా పలు రాష్ట్రాల్లో మొత్తం 102 నియోజకవర్గాలకు ఈ నెల 19న ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో తగిన రసీదులు లేకుండా రూ.50 వేలకు మించి నగదు, బహుమతులు తీసుకెళ్తే ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో, రాష్ట్ర సరిహద్దుల్లో మాత్రం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. పొరుగు రాష్ట్రాలైన కేరళలో ఈ నెల 26, ఆంధ్రలో మే 13వ తేది ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో, రాష్ట్ర సరిహద్దుల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు.

ఉచిత విద్యుత్‌కు రూ.15,332 కోట్లు

ఐసిఎఫ్,ఏప్రిల్21:గృహాలతో పాటు వివిధ విభాగాల్లో ఉచిత,రాయితీ ధర విద్యుత్ అందజేసేందుకు విద్యుత్ బోర్డుకు ఈఆర్థిక సంవత్సరం రూ.15,332 కోట్లు సబ్సిడీని ప్రభుత్వం విడుదల చేసింది.గృహాలకు వందయూనిట్లవరకు ఉచితంగా, 500 యూనిట్ల వరకు రాయితీ ధరకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అలాగే, వ్యవసాయం, గుడిసెలకు ఉచితంగాను, మరమగ్గాలకు తక్కువ ఛార్జీతో విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఇందుకయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా సబ్సిడీలు అందజేస్తోంది.

పురుగుల మందు చల్లిన రైతు మృతి

పెరంబూర్, ఏప్రిల్ 21: పొలంలో పురుగుల మందు పిచికారీ చేసిన రైతు కొద్దిసేపటికి మృతిచెందిన ఘటన పుదుకోట జిల్లాలో చోటుచేసుకుంది. విరాలిమలై సమీపం పాపావయల్ గ్రామానికి చెందిన రాచప్ప (51) ఆదివారం ఉదయం తన పొలంలో పురుగుల మందు పిచికారీ చేశాడు. పని పూర్తయిన తర్వాత పొలం గట్టుపై కూర్చున్న రాచప్ప హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయాడు. చుట్టుపక్కల వారు వెంటనే అతడిని సమీపం లోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీఏ వినతికి సమాధానం ఇవ్వని సబ్ రిజిస్ట్రార్‌కు జరిమానా

పెరంబూర్, ఏప్రిల్ 21: సమాచార చట్టం హక్కు (ఆర్టీఏ) చట్టం కింద సమాచారం ఇవ్వని కోవిల్‌పట్టి సబ్ రిజిస్ట్రార్‌కు రూ.25 వేల జరిమానా విధించారు. కోవిల్‌పట్టి సమీపం ఇనాంపనియాచ్చి గ్రామానికి చెందిన గురుస్వామి తన తండ్రి పేరుతో ఉన్న స్థలం వ్యవహారానికి సంబంధించిన కేసు కోర్టు విచారణలో ఉంది. కేసుకు సంబంధించిన కొన్ని పత్రాలు అవసరం కావడంతో, తన తండ్రి స్థలానికి సంబంధించి 2020 డిసెంబరు 7వ తేది సమాచార హక్కు చట్టం కింద జిల్లా రిజిస్ట్రార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ వ్యవహారంపై సమాధానం ఇవ్వాలని కోవిల్‌పట్టి సబ్ రిజిస్ట్రార్‌కు జిల్లా రిజిస్ట్రార్ సిఫారసు చేశారు. అందుకు సబ్ రిజిస్ట్రార్ భాస్కరన్ బదులివ్వకపోవడంతో గురుస్వామి తమిళనాడు సమాచార కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన కమిషన్, సబ్ రిజిస్ట్రార్ భాస్కరన్‌కు రూ.25 వేల జరిమానా విధించింది.

గంజా మత్తులో పోలీసులపై దాడి.. ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 21: గంజా మత్తులో పోలీసులపై దాడిచేసిన ముగ్గురు కటకటాలపాలయ్యారు. స్థానిక దురైపాక్కం కన్నగి నగర్‌కు చెందిన ఉమాపతిపై గంజాయి విక్రయం, హత్యాయత్నం సహా 9 కేసులున్నాయి. కొద్దిరోజుల క్రితం ఆ ప్రాంతంలో జరిగిన ఘర్షణలో చిన్న, దినేష్ అనే వారిపై ఉమాపతి దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై అందిన ఫిర్యాదుతో కన్నగినగర్ పోలీసులు విచారణకు పోలీస్‌స్టేషన్‌కు రావాలని ఉమాపతిని కోరారు. ఆ సమయంలో ఉమాపతి, అతని ఇద్దరు స్నేహితులు పోలీసులపై రాళ్లతో దాడిచేయడంతో పాటు చేయిచేసుకున్నారు. ఉమాపతి, అతని స్నేహితులు పోలీసులపై దాడిచేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వెలువడ్డాయి. ఈ ఘటనలో గాయపడిన పోలీసులను ఆస్పత్రికి తరలించి ప్రేమ్, రాహుల్, సంతోష్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు, ప్రధాన నిందితుడు ఉమాపతి కోసం గాలిస్తున్నారు.


ఆదివారం సాయంత్రం మెరీనాబీచ్‌లో గుమికూడిన నగరవాసులు

తిరువణ్ణామలైలో రేపు చిత్రా పౌర్ణమి

- గిరిప్రదక్షిణకు లక్షల్లో రానున్న భక్తజనం
- ప్రత్యేక బస్సులు నడుపుతున్న అధికార యంత్రాంగం

అడయార్, ఏప్రిల్ 21: ఈ నెల 23వ తేదీ పౌర్ణమి సందర్భంగా తిరువణ్ణామలైలో గిరిప్రదక్షిణకు 25 లక్షల మంది భక్తులు రావొచ్చని జిల్లా యంత్రాంగంతో పాటు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగినట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా తిరువణ్ణామలైకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా భారీ సంఖ్యలో ప్రత్యేక బస్సులు నడిపేలా రవాణా శాఖ దృష్టిసారించింది. అలాగే, అరుణాచలేశ్వర స్వామిని దర్శించుకునే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా, రాజగోపురం ప్రవేశద్వారం నుంచి ఆలయంలోకి అడుగుపెట్టే భక్తులకు ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం కూడా ఏర్పాటుచేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు. గిరిప్రదక్షిణ చేసేందుకు 23వ తేదీ వేకువజామున 4.16 నుంచి 24వ తేదీన తెల్లవారుజామున 5.47 గంటల వరకు శుభ సమయమని ఆలయ అధికారులు తెలిపారు. అయితే, 23వ తేదీ మంగళవారం పగటిపూట గిరి ప్రదక్షిణ చేసే భక్తులు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా, గిరిప్రదక్షిణ సాగే 14 కిలోమీటర్ల కొండ చుట్టూ గుర్తింపు కార్డులు, ముందస్తు అనుమతి పొందిన వారే అన్నదానాలు చేయాలని ఆయన కోరారు.

1200 ప్రత్యేక బస్సులు...

23వ తేదీ చిత్ర పౌర్ణమి కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 1200 బస్సులు నడిపేలా రవాణా శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకోసం తిరువణ్ణామలై పట్టణంలో 9 తాత్కాలిక బస్టాండ్లను ఏర్పాటు చేశారు. చెన్నై నుంచి తిరువణ్ణామలై వచ్చే భక్తుల సౌకర్యార్థం బస్సులను దిండివనం బైపాస్ రోడ్డులో పార్కింగ్ చేసేలా ఏర్పాట్లుచేశారు. సేలం, తిరుపత్తూరు, ధర్మపురి, కృష్ణగిరి జిల్లాల బస్సులు చెంగం రోడ్డులో పార్కింగ్ చేసేలా, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే బస్సులు వేంగికాల అన్నా జంక్షన్ వద్ద పార్కింగ్ చేసేలా ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. అలాగే, చెన్నై, వేలూరు, విల్లుపురం ప్రాంతాల నుంచి తిరువణ్ణామలైకు నడిపే ప్రత్యేక రైళ్ళ వివరాలను సోమవారం ప్రకటించనున్నారు. గిరి ప్రదక్షిణ మార్గంలో ఆటోల సహా ఇతర వాహనాలను అనుమతించరని పోలీసులు తెలిపారు. దివ్యాంగులకు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆలయ అధికారులు వెల్లడించారు.

విమానాశ్రయంలో కొత్త కంట్రోల్ టవర్


210 అడుగుల కంట్రోల్ టవర్

పెరంబూర్, ఏప్రిల్ 21: స్థానిక మీనంబాక్కంలో ఉన్న విమానాశ్రయం లో 210 అడుగుల ఎత్తులో కొత్త కంట్రోల్ టవర్ ఏర్పాటుకు పర్యావరణ శాఖ అనుమతి కోరుతూ లేఖ రాశారు. దేశంలో ప్రయాణికులు అధికంగా ఉండే విమానాశ్రయాల్లో చెన్నై విమానాశ్రయం ఒకటి. ప్రతి ఏటా విమాన సేవల పెంపుతో పాటు ప్రయాణికుల సంఖ్య కూడా పెరుగుతోంది. ప్రతి విమానాశ్రయంలో విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌లకు అవసరమైన సిగ్నల్స్ అందించేలా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ బాధ్యత. నగరానికి వచ్చే విమానాలు ఎప్పుడు, ఏ రన్‌వేపై ల్యాండింగ్ అవ్వాలి తదితరాలు ఈ కంట్రోల్ రూమ్ ద్వారా సిగ్నల్స్ అందజేస్తుంటారు. ఈ విమానాశ్రయంలో ప్రస్తుతం 52 అడుగుల ఎత్తున కంట్రోల్ రూమ్ ఉంది. దీని ద్వారా 26,000 నుంచి 46,000 అడుగుల ఎత్తులో ఉన్న విమానాలకు మార్గనిర్దేశం చేస్తుంటారు. కాగా విమానాశ్రయ విస్తరణలో భాగంగా కొత్త కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించి, అందుకు సంబంధించిన ప్రాజెక్ట్ సిద్ధం చేశారు. ఆ ప్రకారం, 210 అడుగుల ఎత్తు (23 అంతస్తుల ఎత్తుకు సమానంగా)లో కొత్త కంట్రోల్ రూమ్ ఏర్పాటుకానుంది. ఈ టవర్ ఎత్తు ఎక్కువగా ఉండడంతో పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా పొందాల్సి ఉంది. ఆ ప్రకారం, కొత్త కంట్రోల్ రూమ్ నిర్మాణానికి అనుమతి కోరుతూ విమానాశ్రయ అధికారులు ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెసెమెంట్ కమిషన్‌కు లేఖ రాశారు.

కాలేజీ విద్యార్థిని మృతి

అడయార్, ఏప్రిల్ 21: తిరుచ్చి శ్రీరంగం రాజగోపాల నగర్‌కు చెందిన జయశ్రీ (18) అనే విద్యార్థిని దుర్మరణం చెందింది. రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారిపడటంతో ఆమె తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారు. ఈ విద్యార్థిని తిరుచ్చిలోని కాలేజీలో బీఏ చదువుతోంది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శవపరీక్ష నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

తిరుమల ఘాట్‌లో జీపు బోల్తా

- ఐదుగురు చెన్నై భక్తులకు గాయాలు


ప్రమాదానికి గురైన జీపు

తిరుమల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల రెండో ఘాట్‌లో ఓ జీపు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు భక్తులు గాయపడ్డారు. చెన్నైకి చెందిన ఐదుగురు భక్తులు శ్రీవారి దర్శనార్థం ఆదివారం మధ్యాహ్నం ఓ జీపులో తిరుమలకు బయల్దేరారు. మార్గమధ్యంలో జీపు అదుపుతప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో 50 ఏళ్ల వయసున్న ఓ మహిళకు తీవ్రగాయాలవగా, మిగిలిన నలుగురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బాధితులను తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రికి తరలించి, వైద్యం అందించారు. కాగా, రోడ్డుపై జీపును తొలగించి, ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారిస్తున్నారు.

కుటుంబాలతో ఊటీ, కొడైకెనాల్‌కు...



చెన్నై, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన ఊటీ, కొడైకెనాల్‌కు ఆదివారం పర్యాటకుల తాకిడి అధికమైంది. ఈ రెండు ప్రాంతాల్లోనూ గత మూడు రోజులుగా దేశవిదేశాల నుంచి వందల సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారు. ప్రతి ఏటా ఏప్రిల్, మే నెల్లో ఎండలు అధికంగా ఉండటంతో పర్యాటకులు ఈ రెండు ప్రాంతాల్లో పర్యటించడం ఆనవాయితీగా ఉంటుంది. ఏప్రిల్‌లో లోక్‌సభ ఎన్నికలు జరుగటంతో నెలారంభంలో ఊటీ, కొడైకెనాల్‌లో పర్యాటకుల సందడి కనిపించలేదు. ప్రస్తుతం ఎన్నికలు ముగియగానే శని, ఆదివారాలు సెలవు కావటంతో పలు నగరాల నుంచి పర్యాటకులు ఆ రెండు ప్రాంతాలకు కుటుంబ సభ్యులతోపాటు వెళ్ళారు. ఆదివారం ఉదయం బొటానికల్ పార్కు, రోజ్ గార్డెన్, తొట్టబెట్టా, కున్నూరు సిమ్స్ పార్కు తదితర ప్రాంతాలలో విపరీతమైన పర్యాటకుల రద్దీ ఏర్పడింది. ఇదే విధంగా కొడైకెనాల్‌లోను గుణా గుహ, ఫైన్ ఫారెస్ట్, మోయిర్ పాయింట్, గ్రీన్ కేవ్, రోజ్‌గార్డెన్, సిల్వర్ ఫౌంటైన్ ప్రాంతాలను వందల సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు.

ఆటోలో మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 21: స్థానిక ట్రిప్లికేన్ సమీపంలో ఆటోలో మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ట్రిప్లికేన్ పోలీసులు శనివారం రాత్రి గస్తీ తిరుగుతున్న సమయంలో చేపాక్కం సమీపం వాలాజా రోడ్డులో నిలిపి ఉంచిన ఆటోను పరిశీలించారు. ఆటోలో మద్యం బాటిళ్లు ఉంచి అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తించి, మైలాపూర్ మీనంపాల్‌పురం ప్రాంతానికి చెందిన మణికంఠన్ (31), మైలాపూర్ సిటీ సెంటర్ షణ్ముగం పిళ్లై వీధికి చెందిన సెల్వంను అరెస్ట్ చేసి 624 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.


చెన్నైలో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న సీపీఎం నేతలు కే బాలకృష్ణన్, జి. రామకృష్ణన్ తదితరులు

• నేడు ప్రపంచ ధరిత్రీ దినోత్సవం

ఎటు చూసినా పచ్చని పైర్లు, హరితవర్ణంతో కళకళలాడే వృక్షాలు, పండ్ల భారంతో వంగిన చెట్లు, సువాసనలు వెదజల్లే పూలమొక్కలు, దట్టమైన అడవులు, వాటిలో నివసించే అనేక జంతు సమూహాలు, స్వేచ్ఛగా ఎగిరే పక్షుల గుంపులు, నిండుగా పారే నదీనదాలు, సముద్రాలు, కొండలూ, కోనలు...ఇవీ భూమిపై ఒకనాటి అపురూప దృశ్యాలు. ఎండిన పైర్లు, నీళ్లు ఇంకిన నదులు, మోడువారిన చెట్లు, అడవులను నరికి కట్టిన ఆకాశహర్మ్యాలు, నిలువనీడలేక కనుమరుగవుతున్న అరుదైన జంతువులు, పక్షులు, స్వచ్ఛమైన గాలికి, తాగునీటికి అల్లాడే ప్రాణికోటి, వ్యర్థాలు నిండిన నీటిలో అసువులు బాస్తున్న అనేక జీవరాశులు, నిండుతనం కోల్పోయి వెలవెలబోతున్న కొండలు, కరిగిపోతున్న హిమానీ నదులు.... ఇవీ భూమిపై ఈనాటి చిత్రాలు.. పుడమి తల్లికి గర్భ శోకాలు.. నేడు ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

- వేళచ్చేరి



పుడమికి మనుగడ కలిగిద్దాం...

పర్యావరణానికి రక్షణ కల్పిద్దాం

పుడమి తల్లిగా, నేలతల్లిగా, భూమాతగా మనం కొలిచే ధరిత్రికి ఏమవుతోంది? మన స్వయంకృతాపరాధం, మానవ తప్పిదాల వల్ల నేలతల్లి తల్లడిల్లుతుందా? భూ మండలంలో ఉన్న అన్ని జీవరాసులకు తల్లి ఈ పుడమి ఒక్కటే! మరి మన తల్లిని రక్షించాల్సిన, సంరక్షించాల్సిన బాధ్యత కూడా మనందరిదే కదా! అందుకే ప్రతి ఏటా ధరిత్రీ దినోత్సవాలు జరపాలనే నిర్ణయం తీసికోబడింది.

ధరత్రి దినోత్సవ లక్ష్యాలు...

వాతావరణ అస్తవ్యస్తాల వలన భూమిపై జరిగే మార్పులు, మానవ తప్పిదాల వల్ల పర్యావరణానికి కలుగుతున్న పెనుముప్పు, దాని పర్యవసానంగా సంభవిస్తున్న అతివృష్టి, అనావృష్టి, సునామీలు, ఉప్పెనలు, వీటన్నిటి వల్ల పుడమికి కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ధరిత్రీ దినోత్సవ ప్రధాన లక్ష్యం. అంతేకాదు, ప్రకృతి విధ్వంసానికి అడ్డుకట్ట వేసి పర్యావరణ పరిరక్షణకు చేపట్టవలసిన చర్యలు, అనుసంచాల్సిన పద్ధతులు మొదలైన వాటి గురించి వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజల ముందుంచడం కూడ ధరిత్రీ దినోత్సవ లక్ష్యమే. పర్యావరణానికి జరిగే హానిని తిప్పికొట్టేందుకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆ దిశగా ముందుకు నడవాల్సిన ఆవశ్యకత గురించి ధరిత్రీ దినోత్సవం తెలియజేస్తుంది.

మొదట అమెరికాలో ప్రారంభమైన ఈ ఉత్సవం దాదాపు 190 దేశాలకు వ్యాపించింది. అందరూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 22వ తేదీ 'ప్రపంచ ధరిత్రీ దినోత్సవం'గా జరుపుకుంటున్నారు. నేటి మానవుడు ప్రకృతిని తన గుప్పెటలో ఉంచే ప్రయత్నం చేస్తూ దాని వినాశనానికి కారణమవుతున్నాడు. చెట్లను నరకడం, కొండలను పిండిచేయడం, అడవులను ఆక్రమించి ఆవాసాలు నిర్మించడం, ఖనిజాల దోపిడి, ఇసుక దోపిడి.... ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయి. ప్రకృతిని ఎంత నాశనం చేయాలో అంతగా దానిని తుదముట్టిస్తున్నాడు మనిషి. అధిక జనాభా కారణంగా నివసించే స్థలంలేక అడవులను నరికి ఇల్లు నిర్మించుకుంటున్నారు. దాని కారణంగా పక్షులు, జంతువులు తమ ఉనికిని కోల్పోతున్నాయి. అడవులను నరకడం వలన వర్షాభావానికి దారి తీసే పరిస్థితులు ఎదురవుతున్నాయి.

పారిశ్రామికీకరణ కారణంగా పెరిగిన ఫ్యాక్టరీలు, వాటి నుంచి వెలువడే వ్యర్థాలు, పొగ పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. వ్యవసాయంలో రసాయనాల వినియోగంతో భూమి నిస్సారంగా మారుతోంది. దీని కారణంగా ఆహార సంక్షోభానికి దారి తీస్తున్నది. ఆటోమొబైల్ పరిశ్రమ అభివృద్ధి, కాలుష్యంపై ప్రభావం చూపిస్తోంది. మిగిలిపోయిన పంటను కాల్చివేయడం వల్ల ఏర్పడే పొగ, ధూళి కూడా కాలుష్యానికి కారణమవుతున్నాయి. ప్రకృతిని, పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేసిన దాని పర్యవసానం, జలప్రళయాలు, ఉప్పెనలు, సునామీలు. రుతుపవనాలు గతి తప్పి, అతివృష్టి, అనావృష్టి, దుర్భిక్షాలు ఏర్పడి ప్రాణనష్టాన్ని కలిగిస్తున్నాయి. వాతావరణ మార్పులు, భూతాపం (గ్లోబల్ వార్మింగ్) మానవుల అనాలోచిత చర్యలు, ధ్రువాల వద్ద మంచు, హిమానీనదాలు వేగంగా కరిగిపోవడానికి దారి తీస్తున్నాయి. పర్వత ప్రాంతాల్లో ఆవాసాల నిర్మాణం, రహదారుల నిర్మాణం, జలవనరులు తరిగిపోవడం, చెట్లను నరికివేయడం వల్ల ఆ ప్రాంతంలో నేల గుల్ల బారుతోంది. ప్రణాళికారహితంగా, అసంబద్ధంగా చేపట్టే నిర్మాణాలు, గనుల తవ్వకం కూడా భూమాతకు హాని కలిగిస్తున్నాయి. అతిగా పెరుగుతున్న ప్లాస్టిక్ వాడకం కూడా పర్యావరణానికి చాలా చేటు కలిగిస్తున్నది. ఇలా మన నిర్లక్ష్యంతో, అత్యాశతో, మన భూమికి, పర్యావరణానికి అంతులేని హాని కలిగిస్తున్నాం. ఇప్పటికైనా మనం కళ్లు తెరవాలి. ఓ చిన్న రంధ్రమే పెద్ద ఓడని ముంచేస్తుందన్న విషయం గుర్తుంచుకొని తగిన చర్యలు చేపట్టాలి. కాలుష్యంలో మనం భాగం కాకుండా పరిష్కారంలో భాగం కావాలి అందరూ. మరి ఏం చేయాలి?

పరిష్కార మార్గాలు...

ముందుగా పచ్చదనాన్ని స్వాగతిద్దాం. చెట్లను పెంచుదాం. అడవులను రక్షిద్దాం. అనుమతులు లేని ప్రాజెక్టులకు అడ్డుకట్ట వేద్దాం. భూ వనరులను రక్షించడం అవసరం అనే విషయాన్ని అందరూ గుర్తించాలి. జంతువులు, పక్షులు, సమస్త జీవరాశికి పుడమే ఒక సంపద. దీన్ని ఎంతో జాగరూకతతో రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిదీ.

తమిళనాట నీటి , వాయు కాలుష్యం కోరలు విప్పుతోంది. తమిళనాట పారిశ్రామిక ప్రాంతాల్లో భూగర్భజలాలు మరింత కలుషితమవుతున్నాయి. నదీ కాలుష్య విషయంలో రాష్ట్రంలో వేలూరు అత్యంత కలుషిత జిల్లా అని కొత్త అధ్యయనం తెలుపుతున్నది. ఆరేళ్లలో చెన్నైకి కాలుష్య ముప్పు పెరుగుతుందని అంచనా. చెన్నై, తూత్తుకుడి త్వరలో వాయుకాలుష్యంలో ముందుకుపోతున్నవని పరిశోధకుల హెచ్చరిస్తున్నారు.



పర్యావరణ పరిరక్షణకు రాష్ట్రంలోను, దేశంలోను, ప్రపంచంలోను ఎంతో కృషి జరుగుతోంది. చెన్నైలో కూవం, అడయార్ నదులను శుభ్రపరిచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మురుగునీటిని శుద్ధి చేసి పునర్వినియోగానికి లేదా రీసైక్లింగ్‌కి ఉపయోగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎన్నో స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు నేలతల్లికి కలుగుతున్న ముప్పును గ్రహించి పరిష్కారం దిశగా కృషిచేస్తున్నారు. ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీవాసుదేవ్ ప్రకృతికి, మట్టికి ప్రత్యామ్నాయం లేదని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ అని చెప్పడమే కాక స్వయంగా 'సేవ్ సాయిల్' ఉద్యమాన్ని చేపట్టారు.

ఫ్యాక్టరీల నుంచి వెలువడే వ్యర్థాలు కాలుష్యాన్ని పెంచుతాయి. దానికి ప్రభుత్వం తగిన జాగ్రతలు వహించాలి. కొండలు తవ్వడం, ఇసుక తవ్వకాలు మొదలైన ప్రకృతి విధ్వంసక చర్యలకు ప్రజలు స్వస్తి పలకాలి. వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల వాడకం ప్రారంభించాలి. రీ సైక్లింగ్‌కి ఉపయోగపడే వస్తువులను ఉపయోగించడం అందరూ అలవాటు చేసుకోవాలి. పర్యావరణ క్షీణతకు కారణమయ్యే కార్యకలాపాలపై ప్రభుత్వం ఆంక్షలు విధించాలి.

ఎన్నో జాతీయ, అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నాయి. పర్యావరణ విరుద్ధ కార్యకలాపాలను ప్రత్యక్ష కార్యాచరణతో అడ్డుకుంటున్నాయి. ఐయుసీఎన్ అనే పర్యావరణ సంస్థ సహజవనరుల సంరక్షణ, స్థిరత్వం కాపాడేందుకు పనిచేసే సంస్థ. ఐయుసిఎన్ అంతరించే దశలో ఉన్న జంతువులను, మొక్కలను వాణిజ్యం నుంచి నిషేధించేందుకు కృషిచేస్తోంది. ఇలా ఎన్నో సంస్థలు ధరిత్రీ రక్షణకు కంకణం కట్టుకున్నాయి. పర్యావరణ పరిరక్షణ గురించి ప్రజలలో అవగాహన కల్పించేందుకు అనేక సాహిత్య రచనలు కూడా వెలువడ్డాయి.

జాగృతమైన దేశాలు, ప్రభుత్వాలు నేలతల్లిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. అందులో భాగమే 'ప్రపంచ ధరిత్రీ దినోత్సవం'. మన సౌర వ్యవస్థలో జీవనాన్ని నిలబెట్టే ఒకే ఒక గ్రహం భూమి. ఇది అన్ని జీవరాసులకు నిలయం. ప్రతి జీవి కోసం దీన్ని రక్షించాల్సిన బాధ్యత అందరిదీ.

భారతీరాజా కీలక పాత్రలో 'నిరమ్ మారుం ఉలగిల్'



సీనియర్ దర్శకుడు భారతీరాజా కీలక పాత్రలో 'నిరమ్ మారుం ఉలగిల్' అనే చిత్రం తెరకెక్కనుంది. నట్టి, రియోరాజ్, శాండి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. సిగ్నేచర్ ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కే ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు. సినిమా ద్వారా బ్రిట్రో కేజీ వెండితెరకు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రం గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'నాలుగు విభిన్న జీవితాలు, నాలుగు కథలు, వాటిని అనుసంధానం చేసే ఒక మంచి పాయింట్‌తో మానవ సంబంధాలు, జీవితాలు, భావాల ఆవశ్యకతను వివరిస్తూ ఒక కమర్షియల్ సినిమాగా రూపొందిస్తున్నాం. ఈ నాలుగు పాత్రలు వేర్వేరు కాలాల్లో జరిగేలా ఉంటాయి' అని పేర్కొన్నారు. తాజాగా రిలీజ్ చేసిన ఫస్ట్‌లుక్‌లో బ్లడీ డార్క్ రెడ్ బ్యాక్ గ్రౌండ్, గన్, ఆటో, మిర్రర్, హౌసింగ్ బోర్డ్ బ్యాక్ గ్రౌండ్, ఓ మహిళ ఛాయా ముఖం, డిఫరెంట్ పాత్రలతో ఈ లుక్ హృదయాన్ని ద్రవింపజేసేలా ఉంది. భారతీరాజా, నట్టి, రియోరాజ్, శాండి గతంలో చూడని లుక్‌లో భయపెట్టేలా కనిపిస్తున్నారు. ఇతర పాత్రలను సురేష్ మేనన్, నరేన్, మైమ్ గోపి, వడివుక్కరసి, విఘ్నేష్‌కాంత్, రిషికాంత్, కనిహా, ఆధీరా, కావ్య అరివుమణి తదితరులు పోషిస్తున్నారు.

'నిరమ్ మారుం ఉలగిల్' ఫస్ట్‌లుక్

'నెవర్ ఎస్కేప్'లో ప్రేక్షకులను భయపెట్టే

డ్యాన్స్ మాస్టర్ రాబర్ట్

కొరియోగ్రాఫర్ రాబర్ట్ మాస్టర్ వెండితెరపై విలన్‌గా కనిపించారు. ఆయన ప్రతినాయకుడిగా, ఆది పృథ్వి, హర్షిణి, కవి జె సుందరం, ఉవిస్ ఖాన్, రాజీ, అఖిలలా సుందర్, జెపిన్ జాన్ ప్రాణేశ్వర్, సష్టి ప్రాణేష్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'నెవర్ ఎస్కేప్'. డీశ్రీ అరవింద్ దేవరాజ్ కథ సమకూర్చి దర్శకత్వం వహించగా, శరణ్ కుమార్ సంగీతం అందించారు. నాన్సీ ఫ్లోరా నిర్మించిన ఈ చిత్రం సస్పెన్స్ భయం, లవ్, స్నేహం ఇలా అన్ని అంశాల మేళవింపుతో తెరకెక్కించగా, గత శుక్రవారం విడుదలై పాజిటివ్ టాక్‌తో ప్రదర్శితమవుతుంది. అనేక భయానక పరిస్థితులతో కూడిన థ్రిల్లర్, సస్పెన్స్‌ను తలిపిస్తూ స్క్రీన్‌ప్లే సాగుతుంది. గురు ప్రదీప్ ఎడిటింగ్, కెమెరామెన్ సంతోష్ కుమార్ పనితనం బాగుంది. ఈ సినిమా సంప్రదాయ జోనర్లకు మించిన సినిమాటిక్ అనుభూతిని అందించేలా ఉంది. ముఖ్యంగా సినిమా చూస్తున్నంత సేపు టెన్షన్, హార్రర్ అంశాలు ప్రేక్షకులను ఉత్కంఠతకు లోనుచేసేలా ఉంటాయి. ముఖ్యంగా కొరియోగ్రాఫర్ రాబర్ట్ మాస్టర్ విలన్‌గా అద్భుతంగా నటించారు. ఆయన థియేటర్ యజమానిగా, ఒక హంతకుడిగా నటించిన ప్రేక్షకులతో శెభాష్ అనిపించుకున్నారు. ఒక వ్యక్తి థియేటర్‌ను నిర్మిస్తాడు. కానీ, ఆ థిప్రేక్షకులు రాకపోవడంతో యజమాని ఆత్మహత్య చేసుకోవడంతో ఆ థియేటర్‌కు యజమానిగా మారిన రాబర్ట్... ఈ థియేటర్‌కు వచ్చే ప్రేక్షకులను ఒక్కొరిగా హత్య చేస్తుంటారు. అలా కొందరు స్నేహతుల బృందం ఆ థియేటర్‌కు సినిమా చూసేందుకు వెళ్ళి ఆ నర హంతకుడి చేతిలో చిక్కుకుంటుంది. వీరు ఆ హంతకుడి నుంచి తప్పించుకున్నారా? లేదా? అన్నదే ఈ చిత్ర కథ.



'నెవర్ ఎస్కేప్'లో ఓ దృశ్యం

చిత్రజ్యోతి

చిన్న నిర్మాతలకు ఓర్పు , సహనం ముఖ్యం

• హీరో విశాల్ వినతి

తక్కువ బడ్జెట్‌తో సినిమాలు నిర్మించే చిన్న నిర్మాతలకు ఓర్పు, సహనం ఎంతో ముఖ్యమని హీరో విశాల్ సూచించారు. ఆయన నటించిన తాజా చిత్రం 'రత్నం'. ఈ నెల 26న తెలుగు, తమిళ భాషల్లో విడుదలకానుంది. ఆ తర్వాత హిందీలో రిలీజ్ చేసేలా ప్లాన్ చేశారు. హరి దర్శకుడు, ప్రియా భవానీ శంకర్ హీరోయిన్. సముద్రఖని, యోగిబాబు ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మార్క్ అంటోనీ' నాకు మాత్రమే కాదు దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్‌కు కూడా మంచి పేరు తెచ్చిపెట్టింది. ఈ చిత్రంలో నటించే సమయంలో పాత విశాల్‌ను చూడాలని చాలా మంది అడిగారు. ఇదే విషయాన్ని దర్శకుడు హరికి ఫోన్ చేసి చెప్పగా, వెంటనే అంగీకరించారు. మా ఇద్దరి కాంబినేషన్‌లో ఎనిమిదేళ్ళ తర్వాత వస్తున్న సినిమా ఇది. అయితే, దర్శకుడుగా తనను తాను అప్‌గ్రేడ్ చేసుకుని హరి ఈ చిత్రాన్ని రూపొందించారు. చిన్న చిత్రాల నిర్మాతలకు ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. జూన్ నుంచి ఐదు నెలల పాటు భారీ బడ్జెట్ చిత్రాలు వరుసగా విడుదలకానున్నాయి. ఆ సమయంలో చిన్న బడ్జెట్ చిత్రాలను విడుదల చేయొద్దన్నది నా విన్నపం. పెద్ద చిత్రాల మధ్యలో చిన్న సినిమాలు కనిపించకుండా పోతాయి. అదే జరిగే, కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రాదు. మే నెలలో నాలుగు శుక్రవారాలున్నాయని, అపుడు ఈ చిత్రాలను రిలీజ్ చేసుకోవచ్చు. జూన్ నుంచి అక్టోబరు నెల వరకు చిన్న సినిమాలు విడుదల చేయొద్దని, ఈ చిత్రాలను నిర్మించిన నిర్మాతలు ఓర్పు, సహనంతో ఉండాలి. పెట్టిన పెట్టుబడి తిరిగి వచ్చేలా ప్లాన్ చేసుకుని సినిమాలను విడుదల చేసుకోవాలి' అని సూచించారు.



విశాల్

హజరత్ దర్గా చందనోత్సవంలో ఏఆర్.రెహ్మాన్



చెంగల్పట్టు జిల్లా, మహాబలిపురం సమీపంలోని నెమ్మేలి, ఈసీఆర్ రహదారిలో ఉన్న హజరత్ మహ్మద్ షా ఖాదిరీ దుర్గా 351వ గంధ మహోత్సవం ఆదివారం జరిగింది. ఈ వేడుకల్లో ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్.రెహ్మాన్ పాల్గొన్నారు. ఈ వేడుకల్లో చెంగల్పట్టుతో చెన్నై, కాంచీపురం, తిరువళ్ళూరు, కల్పాక్కం, తిరుక్కళుగుండ్రం తదితర ప్రాంతాలకు చెందిన ముస్లిం సోదరులు, జమాత్‌లు పాల్గొని గంధ మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఏర్పాట్లను కోవలం ముస్లిం జమాత్‌లు, మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన పెద్దలు ఏర్పాటు చేయగా, స్థానిక పోలీసులు బందోబస్తు కల్పించారు. కాగా, రెహ్మాన్ వరుస చిత్రాలకు కమిట్ అవుతూ అత్యంత బిజీగా ఉన్నప్పటికీ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటున్న విషయం తెల్సిందే.

దర్గా గంధ మహోత్సవంలో ఏఆర్.రెహ్మాన్ తదితరులు

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం

ప్యారీస్, ఏప్రిల్ 21: చూచిన వారిదే భాగ్యం..గాంచిన వారిదే సౌభాగ్యం అన్న చందంగా సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా సాగింది. స్థానిక పులియాంతోపు నరసింహ నగర్‌లోని వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో 46వ వార్షిక శ్రీ రామనవమి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. వేదికపై చిద్విలాసం చిందిస్తూ శ్రీరాముడు, సిగ్గుల మొగ్గల సీతమ్మ వారు వధూవరులై ఆశీనులు కాగా, వేదమంత్రోచ్చరణ, పెళ్లి మంత్రాలు, మంగళవాయిద్యాలు భక్తుల 'జై శ్రీరామ్' నినాదాల నడుమ వేదపండితులు దైవదంపతుల కల్యాణం జరిపించారు. హాజరైన భక్తులకు నిర్వాహకులు వడపప్పు, పానకం, అన్నదానం చేశారు. ఉత్సవ కమిటీ తరఫున గంగుల లింగయ్య, కోటపాటి వెంకటేశ్వర్లు, పందిటి జయరాములు, కృష్ణమూర్తి, బొంటుపల్లి వెంకటేశ్వర్లు, సంకే మాధరమూర్తి, సీహెచ్ మురళి, లింగంగుంట కిరణ్, కొప్పుల అంకయ్య, అల్లూరి గిరి, అంద్రా కొండలరావు, పంబా నారాయణ, ఎస్.తిరుమలరావు, జింకా మహేష్, యామర్తి కొండలరావు, సీహెచ్ శంకర్ పర్యవేక్షణలో ఆదర్శపురుషుడు శ్రీ రామచంద్ర మూర్తి ఊరేగింపు కనువిందు చేసింది.



సీతారాముల వారి కల్యాణోత్సవం

హైందవ సంప్రదాయాన్ని పరిరక్షించుకుందాం

• వీహెచ్‌పీ జాతీయ కన్వీనర్ వై.రాఘవులు

ప్యారీస్, ఏప్రిల్ 21: హైందవ సంప్రదాయాన్ని పరిరక్షించుకుందామని ప్రజలకు విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జాతీయ కన్వీనర్ వై.రాఘవులు పిలుపునిచ్చారు. ఆర్య వైశ్య అఫిషల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్-తమిళనాడు (ఆవోపా), అన్నానగర్ ఆర్యవైశ్య సంఘం, అడయార్ ఆర్యవైశ్య అసోసియేషన్, తమిళనాడు ఆర్యవైశ్య మహాసభ గ్రేటర్ చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో పుదుపేటలోని నాదముని హాలులో విశ్వశాంతం- 2024 పేరిట శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆవోపా అధ్యక్షుడు టీజీ శ్రీనివాసన్ స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వై.రాఘవులు పాల్గొని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న పదిమంది తెలుగు ప్రముఖులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేసి గౌరవించారు. ముందుగా పంచాంగ శ్రవణం, భక్తిగీతాలాపన, ప్రశ్నావళి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో వైవీ హరికృష్ణ, ఎ.సుధాకర్, బయ్యా బాలాజీ, ఎంఎ నరసింహన్, పి.రాధాకృష్ణ, వి. హరినాథ్ తదితరులు పాల్గొన్నారు. కేకే త్రినాథ్ కుమార్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ వేడుకలు ఎ.సుధాకర్ వందన సమర్పణతో ముగిశాయి.



ఉగాది పురస్కార గ్రహీతలతో వై.రాఘవులు, టీజీ శ్రీనివాసన్ తదితరులు

అత్యంత వైభవంగా అవినాశిలింగేశ్వరుడి రథోత్సవం

చెన్నై, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కొంగునాడులోని సుప్రసిద్ధ సప్త శైవాలయాల్లో ఒకటైన అవినాశిలింగేశ్వరాలయ మహారథోత్సవం ఆదివారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. తిరుప్పూరు జిల్లాలోని అవినాశిలింగేశ్వరాలయం కాశీలోని విశ్వనాథస్వామివారి అలయానికి దీటైనదని చెబుతున్నారు. ఈ ఆలయంలో చిత్తిరై ఉత్సవాలు ఇటీవలే ప్రారంభమయ్యాయి. ఉత్సవాలల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమైంది. తిరుప్పూరు జిల్లా నుంచే కాకుండా కోయంబత్తూరు, ఈరోడ్ జిల్లాల నుంచి కూడా వేలాదిమంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. తొలుత ఈ రథాన్ని రథ మండప ప్రాంతం నుంచి ఉత్తర రథవీధీ వరకు నడిపారు. అక్కడ రాయంపాళయం, పుదుపాళయం మిరాశీదారులు రథం వెనుకవైపు చక్రాలకు పటిష్ఠమైన ఇరుసులు బిగించి రథాన్ని కదిపారు. ఆ తర్వాత రథాన్ని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. రథోత్సవంలో పాల్గొన్న భక్తులంతా 'అవినాశియప్పా, హరోంహరా, నమశ్శివాయ, శివశివ' అంటూ భక్తిపారవశ్యంతో నినాదాలు చేశారు.



రథంపై ఆశీనులైన సోమస్కంధర్, ఉమామహేశ్వరి



భక్తజనసంద్రంలో కదలుతున్న అవినాశిలింగేశ్వర రథం

జన కేతనం

ఇదీ సంగతి



వైసీపీకి రాకుంటే కేసే

వైసీపీలోకి వస్తావా.. రావా.. అని అలుపెరగకుండా పార్టీలోకి పిలుస్తూనే ఉన్నారు. టీడీపీ వదిలి నేను రాను సామీ.. ఉన్నతావులోనే కుదురుగా ఉంటా అని ఆయనా చెబుతూనే ఉన్నాడు. సామదానభేద దండోపాయాలు తెలిసిన నాయకులు కదా మన తిరప్తోళ్లు.. పిలిచీ పిలిచీ ఇంకన దండోపాయానికి దిగారు. కేసుల మింద కేసులు పెడుతూ ఇప్పటికన్నా రా..బ్బా అని పిలుస్తూనే ఉన్నారు. ఈ కత తిరుపతి 50వ డివిజన్ తిమ్మినాయుడుపాళెం దళితవాడలో జరతగా ఉండాది. ఇక్కడ కాయం వెంకటరత్నం అనే తెలుగుదేశం పార్టీ నాయకుడు ఉన్నారు. పిలిస్తే పలికే నాయకుడిగా డివిజన్‌లో పేరుంది. మంచి అనుచరులున్నారు. వెంకటరత్నంతో పాటు వీరందరినీ వైసీపీలోకి రమ్మని పిలుస్తున్నారు. రాకపోవడంతో కేసులు పెట్టిస్తున్నారు. దళితవాడలో వైసీపీ వర్గం ద్వారా చిన్నపాటి గొడవలు సృష్టించి తర్వాత పెద్దవిగా చేయడం... వాటిల్లో టీడీపీ సానుభూతిపరులపైనే కేసులు బనాయించడం చేస్తున్నారు. 2019లో ఒకటి, 2020లో రెండు, 2023లో నాలుగు కేసులు పెట్టించారు. 30మంది టీడీపీ సానుభూతిపరులు, పదిమంది మహిళలూ ఇప్పటికే బాధితులయ్యారు. పెడితే పెట్టుకోండి కేసులు.. అంటూ వీరంతా వెరవకుండా గట్టిగా నిలబడ్డారు.

-తిరుపతి (జీవకోన)

పార్టీ పాయ పేరూ పాయ!



రాజకీయాల్లో ఓడలు బండ్లవడం సహజమే. సూళ్లూరుపేట నియోజకవర్గంలో టీడీపీ అంటేనే ఆ కుటుంబంగా, ఆ కుటుంబం అంటేనే టీడీపీగా దశాబ్దాల పాటు నడిచింది. టీడీపీ ఆవిర్భావం నుంచీ ఏ ఎన్నికల్లో అయినా వారు చెప్పినవారికే టికెట్ ఇవ్వడం ఆనవాయితీగా నడిచింది. ఆ కుటుంబంలో అన్న మరణించాక తమ్ముడు ఆ వారసత్వాన్ని కొనసాగించారు. నియోజకవర్గంలో ఆయన మాటే శాసనంగా నడిచింది. ఆయనకు జిల్లా స్థాయిలో మంచి పదవి కూడా పార్టీ ఇచ్చింది. అయితే టీడీపీ అధికారం కోల్పోవడంతోనే వారి తీరు మారిపోయింది. వేధింపులు, కేసులతో దూకుడు ప్రదర్శించిన వైసీపీని ఎదుర్కోలేక తెరమరుగైపోయారు. కేసులు ఎదుర్కొనే పార్టీ శ్రేణులకు అండగా ఉండలేదు. దాంతో కేడర్ కూడా ఆ నాయకుడితో సంబంధం లేకుండా ముందుకు నడవడం అలవాటు చేసుకున్నారు.ఉలుకూ పలుకూ లేకుండా మాయమైపోయిన ఆయన హఠాత్తుగా ఎన్నికలకు ముందు నేనొచ్చేశానోచ్! అంటూ ఊడిపడ్డారు. పార్టీ పగ్గాలు ఎవరూ అప్పగించకుండానే చేతికి తీసుకున్నట్టుగా మాట్లాడారు. మళ్లీ టీడీపీ పునర్వైభవం చూస్తారని చెప్పారు.అటు పార్టీ అధిష్టానం గానీ, ఇటు స్థానిక నాయకులు గానీ ఆయన మాటలు నమ్మలేదు. అభ్యర్థి ఎం పిక విషయంలోనూ ఆయన అభిప్రాయం అడగలేదు. దీంతో అలిగిన ఆ నాయకుడు ఏకంగా వైసీపీలో చేరిపోయాడు. యథాప్రకారం మందిలో ఒకడిగా ఉనికి లేకుండా మిగిలిపోయాడు. ఆయన గత వైభవం కళ్లజూసిన తరం మాత్రం అయ్యో.. ఎట్లా బతికిన కుటుంబం.. అని నిట్టూరుస్తున్నారు.

- తడ

ఇదేంది మస్తానమ్మా.?



ఉల్లంఘనులు

ఆమె రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేసిన పదవిలో ఉన్నారు. అందులోనూ అధికార భాషా సంఘం సభ్యురాలు. నెలకు లక్ష రూపాయలకు పైగా ప్రజాధనాన్ని వేతనంగా అందుకుంటున్నారు. కానీ అవేవీ ఆమెకు పట్టవు. వైసీపీని తిరిగి అధికారంలోకి తీసుకురావడమే పనిగా పెట్టుకున్నారు. తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి గెలుపు కోసం ఆయన తండ్రి కరుణాకర్‌రెడ్డి చేపడుతున్న ప్రచారంలో ఈమె మహిళా కార్యకర్తలా పనిచేస్తున్నారు. ఎన్నికల నిబంధనలు తెలియనట్టు కరపత్రాలను పంచుతూ కనిపిస్తున్నారు. అంతేకాదు అధికారాన్ని అడ్డుపెట్టుకుని తన సామాజిక వర్గాన్ని ఏకం చేసి, వైసీపీకి ఓట్లుగా మార్చే పనిలోనూ బిజీగా ఉన్నట్టు తెలుస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

డిపాజిట్ దక్కడం అంటే...!

నోట్ దిస్ పాయింట్

'ఎన్నికల్లో మనోడికి డిపాజిట్ దక్కలేదు బాసూ' అనే మాట వింటూ ఉంటాం. ఇంతకీ డిపాజిట్ దక్కకపోవడం అంటే ఏమిటో తెలుసా? ఎన్నికల్లో పోటీ చేసేవారు 1951 ప్రజాప్రాతినిధ్యం చట్టం ప్రకారం కొంత డబ్బు డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికల్లో అయితే జనరల్ కేటగిరి వాళ్లు రూ 10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ 5 వేలు డిపాజిట్ కింద చెల్లించాలి. ఎంపీ అభ్యర్థులైతే 25 వేలు, రిజర్వేషన్ స్థానాల్లో అయితే 12.5 వేలు చెల్లించాలి. నామినేషన్ వేసే సమయంలో ఈ సొమ్ము చెల్లించాల్సి వుంటుంది. ఓట్ల లెక్కింపు పూర్తి అయిన తర్వాత విజయం సాధించిన వారి వివరాలు ప్రకటిస్తారు. పోలైన ఓట్లల్లో ఆరింట ఒకవంతు అంటే 16.6 శాతం ఓట్లు సాధించిన వారికి కట్టిన డిపాజిట్ సొమ్ము వెనక్కి తిరిగి ఇచ్చేస్తారు. మిగిన వారికి ఇవ్వరు. అందుకే డిపాజిట్ కూడా దక్కలేదు అంటారు.

- వెంకటగిరి

ఆటోలకు డిమాండ్



ఎన్నికల పుణ్యమా అని ఆటోవాళ్లకి గిరాకీ పెరిగింది. రోజంతా తిరిగితే ఆరేడు వందలు చేతికొచ్చేది ఎక్కువ. ఇప్పుడు ఎన్నికల ప్రచార అవసరాల కోసం ఆటోలను పార్టీలు ముందు బుక్ చేసేసుకుంటున్నాయి. వీటిని ప్రచారరథాలుగా మార్చేసుకుని పల్లెలు తిప్పుతున్నాయి. మండలానికి పది నుంచి పదిహేను ఆటోలు ఇలా తిరుగుతున్నాయి.కొందరు ఆటోలకు డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేసి అభ్యర్థులు చేపట్టిన కార్యక్రమాలు ప్రదర్శిస్తుండగగా, మరి కొందరు ఆటోల్లో అభ్యర్థుల పేరున పాటలు రికార్డు చేసి వినిపిస్తున్నారు. ఎన్నికల ఆటోలకు రోజుకి వెయ్యి రూపాయలు ఇస్తున్నారు. భోజనం కూడా పార్టీలదే. దీంతో ఎన్నికలొచ్చినపుడే కదా నాలుగు రూపాయలు సంపాయించుకోవాలి అని ఎండలు మండుతున్నా లెక్క చేయకుండా ఆటోలవాళ్లు ప్రచారాల్లో బిజీగా ఉంటున్నారు. ఈ ఎఫెక్ట్ సాధారణ ప్రయాణీకుల మీద పడింది. ఆటోలు దొరకడం అటుంచి రేట్లు పెంచేశారు.

- వెంకటగిరి



పులికాట్‌లో పూడిపోయిన జగన్ హామీ

● ఎన్నికల ముందు శంకుస్థాపన డ్రామా ● అభాసుపాలయిన సీఎం ప్రకటన

"నేను అధికారంలోకి వచ్చాక ఏడాదిలోపే పులికాట్ సరస్సులో పూడిక తీయిస్తాను. దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపిస్తాను. మత్స్యకారుల కళ్ళలో ఆనందం నింపుతాను."

2018 మార్చిలో నాయుడుపేటలో పాదయాత్ర సందర్భంగా జగన్ ఇచ్చిన హామీ ఇది.

జగన్ కోరుకున్నట్టే అధికారం లభించింది. ఈమాట చెప్పి సరిగ్గా ఆరేళ్లు పూర్తయింది. పూడిక తీసి, పులికాట్‌కి ప్రాణం పోశారా?

తడ

సూళ్ళూరుపేట, గూడూరు నియోజకవర్గాల పరిధిలో విస్తరించిన పులికాట్ ఉప్పునీటి సరస్సులో రెండు వంతులు ఏపీలో వుండగా ఒక వంతు తమిళనాడులో వుంది. సరస్సులోకి సముద్రపు నీరు ప్రవేశించేందుకు వాకాడు మండలం పూడిరాయదొరువు, కొండూరుపాళెం వద్ద రెండు ముఖద్వారాలున్నాయి. తమిళనాడులో మరొకటి ఉంది. 40 ఏళ్ల కిందటి వరకూ ముఖ ద్వారాల వద్ద ఏటా పూడిక తొలగించేవారు. దీంతో సరస్సులో సముద్రపు నీరు ఏడాది పొడవునా నిలిచి వుండేది. మత్స్యకారులకు ఉపాధిగా నిలిచేది. సైబీరియా నుంచీ ఏటా వచ్చే లక్షకు పైగా వలస పక్షులు విడిది చేసేవి.

మత్స్యకారుల నోట మట్టి

సరస్సులో పూడిక తొలగించకపోవడంతో 18 మత్స్యకార గ్రామాల్లోని 12,500 మంది మత్స్యకారులకు ఉపాధి కష్టమైంది. మట్టి మేటతో సముద్రపు నీరు సరస్సులోకి రావడం లేదు. వర్షాకాలంలో మూడు నెలలు మాత్రమే వస్తోంది. గతంలో 62 రకాలకు చెందిన 1200 టన్నుల మత్స్య సంపద ద్వారా ఏటా రూ.350 కోట్ల నుంచీ రూ.500 కోట్ల మేర వ్యాపారం జరిగేది. 117 రకాల విదేశీ పక్షులు ఏటా అక్టోబరులో వచ్చి విశ్రాంతి తీసుకునేవి. గుడ్లు పొదిగి పిల్లలు కాస్త పెద్దవయ్యాక వెనుదిరిగేవి. పూడిక తీత పనులు జరగక, ఆహారం దొరక్క ఏటా వాటి రాక తగ్గుముఖం పడుతోంది.

ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదు



పులికాట్ పూడికతీత విషయంలో వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. టీడీపీ ప్రభుత్వం గతంలో రూ.48 కోట్లు కేటాయించింది. పనులు మొదలయ్యేసరికి ప్రభుత్వం మారిపోయింది. వైసీపీ నేతలు మాటలు చెబుతున్నారేగాని పనులు కావడం లేదు. పూడికతీత సమస్య మత్స్యకారులను వెంటాడుతూనే ఉంది.

- బొమ్మన శ్రీధర్, మాజీ జడ్పీటీసీ,

పర్యావరణ సంక్షోభాన్ని గుర్తించిన చంద్రబాబు

2018 జనవరి 7న నెల్లూరుకు వచ్చిన నాటి సీఎం చంద్రబాబు పర్యావరణ సంక్షోభాన్ని గుర్తించి పులికాట్‌లో పూడికతీతకు రూ.48 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. సర్వే చేయాలని సకాన్ సంస్థకు ఆదేశాలిచ్చారు. చర్యలకు ఉపక్రమించేలోపే ఎన్నికల హడావిడి మొదలవ్వడంతో ఆచరణ సాధ్యం కాలేదు.

జగన్ ఉత్తుత్తి హడావుడి

పాదయాత్ర సందర్భంగా పూడిక తీయిస్తానంటూ హామీ ఇచ్చిన జగన్ అధికారంలోకి వచ్చినా దీన్ని పట్టించుకోలేదు. తీరా ఎన్నికలు సమీపించాక గతేడాది నవంబరులో హడావుడి చేశారు. రూ.100 కోట్లతో సాగరమాల ప్రాజెక్టు ద్వారా పనులు చేయిస్తామంటూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రకటించారు. అదే నెల 21న సీఎం జగన్ శంకుస్థాపన చేస్తారన్నారు. తుపాను వల్ల ఆయన పర్యటన రద్దయింది. వాస్తవానికి పనులకు సంబంధించి కేంద్రం నుంచి కొన్ని అనుమతులు వచ్చాయే తప్ప నిధుల కేటాయించలేదు. ఎన్నికల నేపథ్యంలో మత్స్యకారులను నమ్మించేందుకు ప్రయత్నించి అధికార పార్టీనేతలు భంగపడ్డారు.

ఎన్నికల ముందు హడావుడి

నాలుగున్నర సంవత్సరాల పాటు సమస్యను పట్టించుకోలేదు. మూడు నెలల ముందు శంకుస్థాపన అంటూ హడావుడి చేశారు. పనులు మాత్రం మొదలుకాలేదు. ఈ సారి కూడా జగన్ మాల ఎన్నికల హామీగానే మిగిలిపోయింది.



- సెల్వీ సుధాకర్, మత్స్యకార నాయకుడు, భీములవారిపాళెం

సీన్ రివర్స్

శ్రీకాళహస్తి వర్తమానం

శ్రీకాళహస్తిలో ఈసారి సీన్ రివర్సవుతోంది. ఒకసారి ఓటమి సానుభూతి.. వైసీపీ వేవ్‌లో ఎమ్మెల్యేగా గెలుపొందిన మధుసూదన్‌రెడ్డికి ప్రస్తుతం ఎదురుగాలి వీస్తోంది. విపరీతమైన అవినీతి ఆరోపణలున్నాయి. నిత్య వివాదాస్పద నేతగా ముద్ర వేసుకున్నారు. ఎవరిపైనా రానంతగా భూకబ్జాలు, దాడులు, దౌర్జన్యాలు, అక్రమ, కేసులు వంటి విమర్శలు ఆయనపై వచ్చాయి.

- శ్రీకాళహస్తి



- వైసీపీ ఎమ్మెల్యేపై విపరీతమైన అవినీతి ఆరోపణలు
- ద్వితీయ శ్రేణి నాయకులు కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి
- ప్రభావత నేతల చేరికతో టీడీపీలో జోష్
- కలసివస్తున్న బీజేపీ, జనసేన మద్దతు

శ్రీకాళహస్తి వైసీపీ శ్రేణుల్లో అంతులేని అసంతృప్తి అలముకుంది. ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి వైఖరితో సొంత పార్టీలోని ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల్లో భరించలేని అసహనం, అసంతృప్తి నెలకొంది. గుర్తింపు రాకపోవడం, పదవులు దక్కకపోవడం, పనులు జరగకపోవడం వంటి కారణాలతో అసంతృప్తి పేరుకుపోయింది. గ్రూపులు పెరిగిపోయాయి. వలస నేతలకు పెద్దపీట వేయడం వీరి అసంతృప్తికి మరింత ఆజ్యం పోసింది. ఎమ్మెల్యే కుటుంబం చుట్టూ కోటరీ ఏర్పడింది. కోటరీ నేతల అతిపెత్తనంతో ఆత్మాభిమానం దెబ్బతింటోందని పార్టీ శ్రేణులు ఆవేదన చెందుతున్నాయి. ఏకగ్రీవంగా ఎన్నికైన ముగ్గురు జడ్పీటీసీలు ఇలాంటి కారణంతోనే వైసీపీకి ఝలక్ ఇచ్చారు. ఈ అనూహ్య పరిణామంతో వైసీపీ చతికిలపడింది. గత ఎన్నికల్లో వైసీపీకి అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్య, నాయకులు లక్కమనేని మధు వంటి నేతలు పార్టీని వీడారు. వైసీపీ అభ్యర్థి ఓటమే లక్ష్యంగా వీరంతా పనిచేస్తున్నారు. మరోపక్క భూకబ్జాలు, దాడులు, దౌర్జన్యాలు, అక్రమాల్లో ఇక్కడి ఎమ్మెల్యే తీవ్రమైన అపప్రద మూటగట్టుకున్నారు. శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికలు జరగకపోవడంతో వైసీపీలోని ఆశావాహులు భంగపడ్డారు. వార్డుల్లో చిన్నాచితకా నాయకులందరూ పార్టీకి దూరమయ్యారు. ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి నియామకాల విషయంలోను మధు విఫలమయ్యారని సొంత పార్టీ నేతలు భగ్గుమంటున్నారు. పట్టణంలో దాడులు పెరిగిపోయాయి. స్వపక్షంలోను దాడులకు తెగబడటం పార్టీ పరువును బజారుకీడ్చింది. ప్రశాంత శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో రౌడీయిజం పెరిగిందన్న ఆవేదన స్థానికుల్లో నెలకొంది. ఈనేపథ్యంలో ఎన్నికల్లో పార్టీ శ్రేణులు కలసిరాక ఎమ్మెల్యే ఎదురీదుతున్నారు.

పోటెత్తిన వలసలు

సాధారణంగా ఎన్నికలకు ముందు వలసలు మామూలే. కానీ, శ్రీకాళహస్తిలో 14నెలల ముందే మాజీ ఎమ్మెల్యే సత్రవాడ ముని రామయ్య టీడీపీలో చేరారు. ఆ తర్వాత మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు గతేడాది జూలైలో భారీగా అనుచర వర్గంతో సొంత గూటికి చేరారు. ముగ్గురు జడ్పీటీసీలు, ఆతర్వాత కొందరు ఎంపీటీసీలు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు ఇక పలువురు మాజీ కౌన్సిలర్లు వైసీపీని వీడారు. టీడీపీ బలం పుంజుకోవడంతో నెల రోజులుగా చేరికలు మరింత పెరిగాయి.



కూటమితో అదనపు బలం

ఎన్డీఏ కూటమితో టీడీపీ అభ్యర్థికి అదనపు బలం చేకూరింది. బలమైన ఓటు బ్యాంకు ఉన్న బలిజ సామాజిక వర్గానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, ఆపార్టీ శ్రేణులు తోడయ్యారు. జనసేన నుంచీ నేతలు, శ్రేణులు ఉత్సాహంగా పనిచేస్తున్నారు.

బలం పుంజుకున్న సుధీర్

టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి బాగా బలం పుంజుకున్నారు. అభివృద్ధి ప్రదాతగా, పాలనాదక్షుడిగా పేరొందిన గోపాలకృష్ణారెడ్డికి వారసుడు సుధీర్ గెలిస్తే మళ్లీ ప్రశాంత వాతావరణం నెలకొంటుందనే మాట ప్రజల్లో వినిపిస్తోంది. రెండేళ్ల కిందట గోపాలకృష్ణారెడ్డి కన్నుమూశారు. ఆయన కర్మక్రియల రోజునే సోదరుడు హరినాథరెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. ఇద్దరు పెద్ద దిక్కులను కోల్పోయిన సుధీర్‌కు తల్లి బృందమ్మ, భార్య రిషితారెడ్డి వెన్నంటి నిలుస్తున్నారు. ఎన్నడూ గడప దాటని ఆ ఇద్దరూ బరువైన బాధ్యతలను భుజానికెత్తుకున్నారు. నియోజకవర్గంలో ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ పలుమార్లు గడప గడపను చుట్టేశారు. ఇక, గతంలో సుధీర్ రెడ్డి మాట కటువు అన్నవారే నేడు ఆయన కలుపుగోలుతనం, అభివృద్ధి పనులపై మాట్లాడే విజన్, నిజాయితీతో కూడిన విధానాలను ప్రశంసిస్తున్నారు. కేడర్‌నూ ఆయన మృదువుగా పలకరిస్తూ కలుపుకొని వెళ్తున్నారు.

చెవిలో పువ్వు



చంద్రగిరి 50 పడకల ప్రభుత్వాస్పత్రి భవనం

చంద్రగిరిలో వంద పడకల ఆస్పత్రి

"పాలనా కేంద్రంగా చరిత్ర కలిగిన చంద్రగిరి నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు చేయిస్తా."

- చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే

గత ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ఈ హామీ ఒక్క అంగుళం కూడా ముందుకు కదల్లేదు. 1999-2004 నడుమ టీడీపీ ప్రభుత్వం ఇక్కడ వంద పడకల ఆస్పత్రికి తగిన భవనాలు నిర్మించింది. అయితే తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. అప్పటి ఎమ్మెల్యే గల్లా అరుణకుమారి 2006లో ఇదే భవనంలో 30 పడకల ఆస్పత్రిని ప్రారంభించారు. 2019 ఎన్నికలకు ముందు టీడీపీ ప్రభుత్వంలో ఆస్పత్రి స్థాయిని 50 పడకలకు పెంచుతూ పులివర్తి నానీ జీవో తెప్పించారు. ఇప్పటికీ అదే స్థాయిలో ఆస్పత్రి నడుస్తోంది. గత ఎన్నికల్లో ఆస్పత్రి స్థాయిని వంద పడకలకు పెంచుతానని హామీ ఇచ్చిన చెవిరెడ్డి ఈ ఐదేళ్లలో దాని గురించి పట్టించుకోలేదు. ప్రభుత్వంలో తనకున్న పలుకుబడితో తుడా ఛైర్మన్‌గా, ప్రభుత్వ విప్‌గా, టీటీడీలో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా పదవులకు మాత్రం జీవోలు తెప్పించుకున్నారు. అలాగే తన కుమారుడిని తుడా ఛైర్మన్‌గా నియమిస్తూ కూడా జీవో తెప్పించుకోగలిగారు. అదే సమయంలో పదిమందికీ పనికొచ్చే ఆస్పత్రి స్థాయి పెంపు విషయంలో జీవో తీసుకురాకుండా హామీ మరచిపోయారు.

● గూడూరు చరిత్ర

ఉద్ధండుల పురిటిగడ్డ

అపార ఖనిజ సంపద.సుదీర్ఘ సముద్రతీరంతో గూడూరు నియోజకవర్గం విశిష్టతను సంతరించుకుంది. రాష్ట్ర రాజకీయాల్లో కీలభూమిక పోషించిన ఉద్ధండుల గడ్డ కూడా ఇది. మాజీ మంత్రి బల్లి దుర్గాప్రసాద్‌రావు నాలుగు సారు విజయకేతనం ఎగురవేశారు. కాంగ్రెస్ అభ్యర్థి పత్రా ప్రకాశ్‌రావు మూడు సార్లు విజయం సాధించారు. గూడూరు రాజకీయాలను శాసించిన నల్లపరెడ్డి, నేదురుమల్లి కుటుంబాలు కాలక్రమంలో నియోజకవర్గాన్ని ఎస్సీకి రిజర్వు చేయడంతో ఇతర స్థానాలకు వెళ్లారు.

నియోజకవర్గం ఆవిర్భవించింది : 1952
ఎన్నిసార్లు ఎన్నికలు జరిగాయి : 15

ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం :

1952-	పెల్లేటి గోపాలకృష్ణారెడ్డి	కాంగ్రెస్
1955	పెల్లేటి. గోపాలకృష్ణారెడ్డి	కాంగ్రెస్
1957	మేర్లపాక మునుస్వామి	కాంగ్రెస్
1962	మేర్లపాక మునుస్వామి	కాంగ్రెస్
1967	వేమారెడ్డి రామచంద్రారెడ్డి	ఇండిపెండెంట్
1972	నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి	ఇండిపెండెంట్
1978	పత్రా ప్రకాశరావు	కాంగ్రెస్
1983	జోగి మస్తానయ్య	తెలుగుదేశం
1985	బల్లి దుర్గాప్రసాద్‌రావు	తెలుగుదేశం
1989	పత్రా ప్రకాశ్‌రావు	కాంగ్రెస్
1994	బల్లి దుర్గాప్రసాద్‌రావు	తెలుగుదేశం
1999	బల్లి దుర్గాప్రసాద్‌రావు	తెలుగుదేశం
2004	పత్రా ప్రకాశ్‌రావు	కాంగ్రెస్
2009	బల్లి దుర్గాప్రసాద్‌రావు	తెలుగుదేశం
2014	పాశం సునీల్‌కుమార్	వైసీపీ
2019	వెలగపల్లి వరప్రసాద్‌రావు	వైసీపీ

మండలాలు: గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు



మున్సిపాలిటీ : గూడూరు

ఓటర్ల సంఖ్య: 2,43,624
పురుషులు: 1,18,435
స్త్రీలు: 1,25,155
ఇతరులు: 34

- గూడూరు అర్బన్